సాక్షి
అనంతపురం

శుక్రవారం । 10 । అక్టోబర్ । 2025



చీనీ టన్ను రూ.15 వేలు
అనంతపురం మార్కెట్‌యార్డులో గురువారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.15 వేలు పలికాయి.



టమాట కిలో రూ.19
అనంతపురం కక్కలపల్లి మండీలో గురువారం కిలో టమాట గరిష్ట ధర రూ.19 పలికింది. కనిష్టం రూ.10, సరాసరి రూ.14 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
35.4°/21.2°

జిల్లా అంతటా గురువారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షం నుంచి తుంపర్లు పడ్డాయి. ఈశాన్యం నుంచి నైరుతి దిశగా గంటకు 8 నుంచి 14 కిలో మీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

వైభవంగా చక్రస్నానం
- ముగిసిన చింతలరాయుడి బ్రహ్మోత్సవాలు



ప్రత్యేక అలంకరణలో ఉత్సవ విగ్రహాలు

తాడిపత్రి రూరల్: పట్టణంలోని భూదేవి, శ్రీదేవి సమేత చింతల వెంకటరమణస్వామి ఆలయంలో గురువారం చక్రస్నానం వైభవంగా జరిగింది. వార్షిక బ్రహ్మోత్సవాల్లో చివరి ఘట్టమైన ఈ వేడుకలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ముందుగా ఆలయ ఆవరణలోని పుష్కరిణికి అర్చకులు మురళి స్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం నుంచి భూదేవి, శ్రీదేవి సమేత చింతల వెంకటరమణస్వామి ఉత్సవ విగ్రహాలను ఊరేగింపుగా పుష్కరిణి వద్దకు తీసుకెళ్లి స్నానం చేయించిన అనంతరం బ్రహ్మోత్సవాలను ధ్వజావరోహణంతో ముగించారు.

20 మండలాల్లో వర్షం
అనంతపురం అగ్రికల్చర్: జిల్లాలోని 20 మండలాల్లో వర్షం కురిసింది. బుధవారం రాత్రి నుంచి గురువారం ఉదయం వరకు 20 మండలాల పరిధిలో 9.1 మి.మీ సగటు వర్షపాతం నమోదైంది. గార్లదిన్నె 47.8 మి.మీ, వజ్రకరూరు 47.2, యాడికి 36, రాప్తాడు 26.2, అనంతపురం 17.4, బొమ్మనహాళ్ 13.4, గుంతకల్లు 10.2 మి.మీ వర్షం కురిసింది. బ్రహ్మసముద్రం, కూడేరు, విడపనకల్లు, కంబదూరు, ఉరవకొండ, బుక్కరాయసముద్రం, కుందుర్పి, నార్పల, ఆత్మకూరు, కణేకల్లు, బెళుగుప్ప, పామిడి, కళ్యాణదుర్గం, గుమ్మగట్ట తదితర మండలాల్లోనూ వర్షం పడింది. రాగల మూడు రోజులు జిల్లాకు వర్ష సూచన ఉన్నట్లు శాస్త్రవేత్తలు తెలిపారు.

నేటి నుంచి బోధనేతర కార్యక్రమాల బహిష్కరణ



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

అనంతపురం ఎడ్యుకేషన్: విద్యారంగ, ఉపాధ్యాయ సమస్యలపై ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) పిలుపులో భాగంగా శనివారం నుంచి జిల్లాలో టీచర్లు బోధనేతర కార్యక్రమాలు బహిష్కరిస్తున్నట్లు ఫ్యాప్టో నాయకులు ప్రకటించారు. ఈ మేరకు గురువారం కలెక్టర్ ఆనంద్, జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.ప్రసాద్‌బాబును కలసి వినతిపత్రం అందజేశారు. పాఠశాలల్లో ఉపాధ్యాయులు కేవలం టీచర్లు, పిల్లల హాజరు, మధ్యాహ్న భోజనం పనులు, పరీక్షల నిర్వహణ, మూల్యాంకనం, బోధన వంటి పనులు చేస్తారని తక్కిన బోధనేతర పనుల జోలికి వెళ్లరని స్పష్టం చేశారు. కలెక్టర్‌ను కలసిన వారిలో ఫ్యాప్టో జిల్లా చైర్మన్ శ్రీనివాస్ నాయక్, సెక్రెటరీ జనరల్ పురుషోత్తం, నాయకులు రత్నం, రమణారెడ్డి, సిరాజ్, రామాంజనేయులు, గోపాల్ రెడ్డి, వెంకటసుబ్బయ్య, ఫణిభూషణ్ తదితరులు ఉన్నారు.

కొత్త టీచర్ల ప్లేస్‌మెంట్స్‌కు కౌన్సెలింగ్




కౌన్సెలింగ్‌ను పర్యవేక్షిస్తున్న డీఈఓ ప్రసాద్‌బాబు

అనంతపురం ఎడ్యుకేషన్: డీఎస్సీకి ఎంపికైన కొత్త టీచర్లకు ప్లేస్‌మెంట్ (స్థానం) కోసం గురువారం కౌన్సెలింగ్ ప్రారంభమైంది. ఎస్జీటీలకు మ్యానువల్‌గా, స్కూల్ అసిస్టెంట్లకు వెబ్ కౌన్సెలింగ్ ద్వారా స్థానాలు కేటాయించేలా ప్రభుత్వం నిర్ణయించింది. శుక్రవారం లోపు పూర్తికావాలని ఆదేశాలు జారీ చేసింది. దీంతో శిక్షణ కేంద్రాల్లోనే ప్రక్రియను కొనసాగిస్తున్నారు. రాత్రి 9 గంటలకు ఎస్జీటీ కౌన్సెలింగ్ ప్రారంభమై అర్ధరాత్రి దాకా కొనసాగింది. మొత్తం 167 మంది ఎస్జీటీలు వారికి నచ్చిన స్థానాన్ని కోరుకున్నారు. స్కూల్ అసిస్టెంట్ టీచర్లలో చాలా మంది తొలిసారి వెబ్ కౌన్సెలింగ్ కావడంతో గందరగోళానికి గురి కాగా.. అధికారులు, సాంకేతిక నిపుణులు వారి అనుమానాలను నివృత్తి చేశారు. శుక్రవారం వారి కౌన్సెలింగ్ కూడా పూర్తయ్యే అవకాశం ఉందని డీఈఓ ప్రసాద్‌బాబు తెలిపారు.

గూడు.. గోడు

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అనంతపురం రూరల్ మండలం ఆలమూరు గ్రామ సమీపంలో ఏర్పాటైన జగనన్న లేఅవుట్ ఇది. అనంతపురం అర్బన్ నియోజకవర్గ పరిధిలో ఇళ్లు లేని 8 వేల మంది నిరుపేదలకు ఇక్కడ ప్రభుత్వమే స్థలం మంజూరు చేసింది. ఇంటి నిర్మాణం పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేయాలని నిర్ణయించింది. జగన్ హయాంలోనే 70 శాతానికి పైగా పనులు చేపట్టారు. అయితే, కూటమి ప్రభుత్వం వచ్చాక సకాలంలో బిల్లులు మంజూరు చేయకపోవడంతో పనులు పూర్తిగా ఆగిపోయాయి.



పేదలపై సర్కారు కక్ష
- కొత్త ఇళ్ల మంజూరులో నిర్లక్ష్యం
- జిల్లాలో 30 వేల మంది నిరీక్షణ
- గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో 76 వేల గృహాలు మంజూరు
- అప్పట్లో రూ.800 కోట్లు ఖర్చు పెట్టిన జగన్ సర్కారు



కొడిమి గ్రామ పంచాయతీ పరిధిలోని జగనన్న కాలనీ ఇది. ఇక్కడ అనంతపురం రూరల్, అర్బన్ ప్రాంతాల నిరుపేదలు దాదాపు 4 వేల మందికి గత ప్రభుత్వంలో ఇళ్ల పట్టాలను మంజూరు చేశారు. అయితే, చంద్రబాబు ప్రభుత్వ కుట్రల కారణంగా పనులు ఆగిపోయాయి. దీంతో ప్రస్తుతం ఇదిగో ఇలా ఇళ్ల నిర్మాణాలు ముళ్ల కంపలతో నిండిపోయాయి. ఈ రెండు చోట్లే కాదు.. జిల్లావ్యాప్తంగా ఇదే పరిస్థితి. కూటమి సర్కారు కొత్త ఇళ్లు మంజూరు చేయకపోగా నిర్మాణాల్లో ఉన్న వాటిపై సైతం కక్ష కట్టడంతో పేదల సొంతిల్లు 'కల'గానే మారిపోయింది.

అనంతపురం టౌన్: కూటమి ప్రభుత్వంలో కొత్త ఇళ్ల కోసం లబ్ధిదారులకు ఎదురుచూపులు తప్పడం లేదు. చంద్రబాబు ప్రభుత్వం వచ్చి ఏడాదిన్నరైనా కొత్తగా ఒక్క ఇంటినీ మంజూరు చేయలేదు. ఎన్టీఆర్ గృహ పథకానికి ఇప్పటికే 30 వేల మందికి పైగా దరఖాస్తు చేసుకున్నారు. అదిగో.. ఇదిగో అంటూ ప్రజాప్రతినిధులు, అధికారులు కాలయాపన చేస్తుండగా.. పేదలు మాత్రం గృహ నిర్మాణ సంస్థ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

గత ప్రభుత్వంలో 76 వేల ఇళ్లు..

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పేదల సొంతింటి కల సాకారం చేసేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. దరఖాస్తు చేసుకున్న 10 రోజుల్లో ఇల్లు మంజూరు చేశారు. జిల్లా వ్యాప్తంగా 426 జగనన్న లేఅవుట్లను ఏర్పాటు చేసి అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ రూరల్ పరిధిలో ఒకటిన్నర సెంటు, అర్బన్ పరిధిలో ఒక సెంటు స్థలాన్ని కేటాయించి పట్టాలను అందించడంతో పాటు పక్కా ఇంటిని మంజూరు చేశారు. జిల్లా వ్యాప్తంగా ఇళ్ల నిర్మాణాల కోసం ప్రత్యేక నిధులను కేటాయించారు. సొంతంగా నిర్మాణ పనులు చేపట్టిన లబ్ధిదారులకు ఎప్పటికప్పుడు బిల్లులను నేరుగా వారి ఖాతాల్లోనే జమ చేశారు. అప్పట్లోనే జిల్లాలో రూ.800 కోట్లకు పైగా నిధులను ఖర్చు చేశారు.

ఎదురుచూసి అలసిపోయా



నాకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ప్రస్తుతం నెలకు రూ. 3 వేల చొప్పున చెల్లిస్తూ అద్దె ఇంట్లో ఉంటున్నాం. కూటమి ప్రభుత్వం వచ్చాక ఇంటి కోసం గ్రామ సచివాలయంలో దరఖాస్తు చేసుకున్నా. ఇల్లు ఎప్పుడు మంజూరు చేస్తారంటూ అధికారుల చుట్టూ తిరిగి అలసిపోయా.

– రమేష్, బ్రహ్మసముద్రం గ్రామం

ప్రభుత్వానికి నివేదించాం
కొత్త ఇళ్ల మంజూరు విషయమై ప్రభుత్వానికి నివేదికలు పంపాం. వచ్చే నెలలో కొత్త ఇళ్లు మంజూరు చేసే అవకాశాలు ఉన్నాయి. ఆదేశాలు రాగానే లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ చేపడతాం.

– శైలజా, గృహనిర్మాణ సంస్థ పీడీ

చిదిమేసిన కూటమి ప్రభుత్వం..

పేదల సొంతింటి కలను కూటమి ప్రభుత్వం చిదిమేసింది. కొత్త ఇళ్లు మంజూరు చేయకపోగా నిర్మాణాల్లో ఉన్న వాటిపై సైతం కక్ష గట్టింది. బిల్లుల మంజూరులో తీవ్ర జాప్యం చేయడంతో కాంట్రాక్టు సంస్థలు వెనక్కు వెళ్లిపోయాయి. చంద్రబాబు కుట్రలతో జగనన్న కాలనీల్లో చాలా ఇళ్లు పునాది దశలోనే ఉన్నాయి.

గుండు జారి.. గుండె అదిరి



గుండురాయి పడడంతో ధ్వంసమైన బాత్‌రూము, ప్రహరీ

రాయదుర్గంటౌన్: పట్టణంలోని గౌడ జగనన్న హౌసింగ్ లేవుట్‌లోని ఓ ఇంటిపైకి ఓ భారీ సైజు గుండురాయి దూసుకొచ్చింది. గుండు రాయి ధాటికి ఇంటి వద్ద బాత్ రూముతో పాటు ప్రహరీ దెబ్బతింది. ఇంటికి సమీపంలో కొండ ఉంది. ఇటీవల అక్కడి ఎర్రమట్టిని కొందరు యథేచ్ఛగా తవ్వి తరలిస్తున్నారు. గుండురాయి ఉన్న స్థలంలో కూడా మట్టి తరలించడంతోనే కిందకు దొర్లినట్లు తెలుస్తోంది. ఇంటి నిర్మాణం పూర్తయినా కాలనీలో వీధిదీపాలు, నీటి వసతి లేక నివాసం ఉండడం లేదని బాధితుడు మన్సూర్ అహ్మద్ తెలిపాడు.

ఖతర్‌లో ఉద్యోగాలకు దరఖాస్తుల స్వీకరణ
అనంతపురం రూరల్: ఖతర్‌లోని దోహాలో హోం కేర్ నర్స్ ఉద్యోగాలకు ముస్లిం, క్రిస్టియన్, సిక్కులు, బౌద్ధులు, పార్సీలు, జైన్ల మతాల్లోని అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా మైనార్టీ కార్పొరేషన్ ఈడీ జగన్‌మోహన్‌రావు తెలిపారు. 21 నుంచి 40 సంవత్సరాల్లోపు వయస్సు ఉండాలన్నారు. బీఎస్సీ జీఎస్ఎం, నర్సింగ్ పూర్తి చేసి, కనీసం రెండేళ్ల అనుభవం ఉండాలన్నారు. ఆసక్తి ఉన్న వారు ఈ నెల 12వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి సమాచారానికి 9849901138, 9949910415, 9160775077 నంబర్లలో సంప్రదించాలన్నారు.

వైద్య కళాశాలల ప్రైవేటీకరణపై పోరుబాట

- బడుగులకు వైద్య విద్య కోసం 17 కళాశాలలకు వైఎస్ జగన్ శ్రీకారం
- రూ.8 వేల కోట్ల బడ్జెట్ కేటాయింపు
- మంజూరైన వైద్య సీట్లనూ వద్దన్న ఘనుడు చంద్రబాబు
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి



మీడియాతో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం కార్పొరేషన్: 'బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, తదితర వర్గాల పేద విద్యార్థులు వైద్య విద్యనభ్యసించాలనే తలంపుతో రాష్ట్రంలోనే ఏ ముఖ్యమంత్రీ చేయని విధంగా బడ్జెట్‌లో రూ.8 వేల కోట్లు కేటాయించి 17 వైద్య కళాశాలలకు గత సీఎం వైఎస్ జగన్ శ్రీకారం చుట్టారు. అన్ని జిల్లాల్లో ప్రజలకు సూపర్ స్పెషాలిటీ వైద్యాన్ని అందుబాటులోకి తీసుకురావాలని సంకల్పించారు. కానీ సీఎం చంద్రబాబు మాత్రం దుర్మార్గపు ఆలోచనలతో వైద్య కళాశాలలను ప్రైవేట్‌పరం చేస్తున్నారు. ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరుబాట చేపడతాం' అని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి అన్నారు. గురువారం వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పోరుబాటలో భాగంగా సంతకాల సేకరణతో పాటు నిరసన కార్యక్రమాలను దశల వారీగా చేపడతామన్నారు. యువత, మేధావులు, వామపక్షాలు, తదితరులు పోరాటంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. నేడు ఎంబీబీఎస్ చదవాలంటే రూ. కోట్లు ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఉందన్నారు. ప్రజాధనాన్ని పీల్చి పిప్పి చేయడమే చంద్రబాబు విధానమన్నారు. 2024 నాటికే విజయనగరం, ఏలూరు, రాజమహేంద్రవరం, నంద్యాల, మచిలీపట్నంలో ప్రభుత్వ కళాశాలల పనులను పూర్తి చేసి తరగతులు కూడా ప్రారంభించడంతో 750 ఎంబీబీఎస్ సీట్లు అందుబాటులోకి వచ్చాయన్నారు. కూటమి ప్రభుత్వం రాకముందే పాడేరు, పులివెందుల కళాశాలల ప్రారంభానికి కేంద్రం అనుమతిచ్చిందన్నారు. పులివెందుల మెడికల్ కళాశాలకు 50 సీట్లు మంజూరైతే, తమకొద్దంటూ ఎన్ఎంసీకి లేఖ రాసిన ఘనుడు చంద్రబాబు అని, చరిత్రలో ఎవరూ ఈ విధంగా చేసి ఉండరని మండిపడ్డారు.

రూ.5 వేల కోట్లతో కళాశాలలకు జీవం..


కూటమి ప్రభుత్వం ఏర్పాటైనప్పటి నుంచి రూ.2 లక్షల కోట్లు అప్పు చేశారని, ఆ డబ్బంతా ఏం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. కేవలం రూ.5 వేల కోట్లు ఖర్చు చేస్తే నూతన వైద్య కళాశాలలను ఏర్పాటు చేయవచ్చన్నారు. ఖరీదైన భూములను తన అనుయాయులకు తక్కువ ధరకే ఇస్తూ చంద్రబాబు హస్తగతం చేసుకోవాలని చూస్తున్నారన్నారు. వైద్య విద్యనభ్యసించేందుకు ఏపీ, తెలంగాణ నుంచి ఇతర దేశాలకు ఏటా 4 వేల మంది విద్యార్థులు వెళ్తున్నారంటూ ఆంధ్రజ్యోతిలోనే కథనం ప్రచురించారని, అయితే కేవలం తెలంగాణ ఎడిషన్‌లో మాత్రమే వచ్చిందని చెప్పారు. 1992లో ఇంజినీరింగ్, వైద్య కళాశాలలను ప్రైవేట్ పరం చేయాలని చూసి ప్రజాగ్రహానికి గురైన అప్పటి సీఎం నేదురుమల్లి జనార్దన్ రెడ్డి చివరకు రాజీనామా చేశారని, చంద్రబాబుకూ అదే గతి పడుతుందని హెచ్చరించారు.

మద్యంలో బాబు అండ్ కోకు వాటాలు..

నకిలీ మద్యం తయారీ అతి పెద్ద స్కాం అని, దీని ద్వారా వచ్చే మొత్తం డబ్బు చంద్రబాబు, ఆయన కుమారుడు లోకేష్‌కు చేరుతోందని, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు ప్యాకేజీ వెళ్తోందని 'అనంత' ఆరోపించారు. ములకలచెరువులో కల్తీ మద్యం తయారీ ఘటనలో పట్టుబడిన జయచంద్రారెడ్డి వైఎస్సార్ సీపీ కోవర్టని అంటున్నారని, మరి తమ పార్టీ నుంచి వచ్చిన అతనికి ఏవిధంగా టీడీపీ టికెట్ ఇచ్చారని ప్రశ్నించారు. తంబళ్లపల్లిలో ఓడిపోయాక ఇన్‌చార్జ్‌గా ఎందుకు నియమించారో కూడా చెప్పాలని డిమాండ్ చేశారు. వైఎస్సార్ సీపీ నుంచి టీడీపీలోకి జంప్ అయి మంత్రులు, ఎమ్మెల్యేలుగా ఉన్న వారు కూడా కోవర్టులేనా అని ప్రశ్నించారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో 43 వేల బెల్టుషాపులను ఒక్క సంతకంతో వైఎస్ జగన్ తొలగించేలా చర్యలు తీసుకుంటే.. చంద్రబాబు వచ్చాక మళ్లీ 70 వేల బెల్టుషాపులు పుట్టుకొచ్చాయన్నారు. జిల్లాలో వివిధ నియోజకవర్గాల్లోని ప్రజాప్రతినిధుల కనుసన్నల్లోనే విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు జరుగుతున్నాయన్నారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆలమూరు శ్రీనివాస్ రెడ్డి, అనుబంధ సంఘాల అధ్యక్షులు సాకే చంద్ర, సైపుల్లాబేగ్, బాకే హబీబుల్లా, మల్లెమీద నరసింహులు, అమర్‌నాథ్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర నాయకులు వెన్నం శివరామిరెడ్డి, జానీ, పార్టీ నగరాధ్యక్షుడు చింతా సోమశేఖర్ రెడ్డి, నాయకులు లక్ష్మణ్ణ, కార్పొరేటర్ కమల్ భూషణ్, తదితరులు పాల్గొన్నారు.

పప్పుశనగ విత్తనం అందేనా?

- అక్కడక్కడా సాగు ప్రారంభం
- రాయితీ విత్తనంపై మాత్రం ఇప్పటికీ స్పష్టత కరువు



విత్తన పప్పుశనగ

అనంతపురం అగ్రికల్చర్: జిల్లాలో రబీ ప్రధాన పంట పప్పుశనగ సాగు ప్రారంభమైంది. అక్కడక్కడా కురిసిన తేలికపాటి జల్లులకే కొందరు రైతులు ముందస్తు సాగుకు ఉపక్రమించారు. ఈ నెల 15 నుంచి నవంబర్ మొదటి వారం వరకు పప్పుశనగ సాగుకు మంచి అదనుగా రేకులకుంట వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్తలు ప్రకటించారు. అయితే గతి తప్పిన వర్షాలు, మారిన వాతావరణ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని ఖరీఫ్ మాదిరిగానే రబీలో కూడా కొందరు రైతులు ముందుగానే పంట సాగు చేస్తూ వస్తున్నారు. ఈ క్రమంలో ఇప్పటికే ఉరవకొండ, బెళుగుప్ప ప్రాంతాల్లో విత్తుకోవడం మొదలు పెట్టారు. మంచి వర్షపాతం నమోదైతే 25 మండలాల పరిధిలో నెలాఖరులోపు 60 నుంచి 70 వేల హెక్టార్ల భారీ విస్తీర్ణంలో పప్పుశనగ సాగులోకి రావచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు.

నోరు మెదపని మంత్రి కేశవ్

రాయితీ విత్తన పప్పుశనగ విషయంలో కూటమి సర్కారు స్పష్టత ఇవ్వకపోవడం రైతులకు ఇబ్బందిగా మారింది. ఇప్పటికే జిల్లాకు 28 వేల క్వింటాళ్ల నుంచి 14 వేల క్వింటాళ్లకు కుదించారు. 40 శాతం ఉన్న రాయితీని 25 శాతానికి పరిమితం చేసి రైతుల్లో నమ్మకం సన్నగిల్లేలా చేస్తున్నారు. ప్రభుత్వాన్ని నమ్ముకోవద్దని సంకేతాలు ఇస్తున్నట్లు తెలుస్తోంది. రబీ మొదలై 10 రోజులు కావొస్తున్నా ఇప్పటికీ విత్తన పంపిణీ ప్రక్రియ చేపట్టకపోవడం గమనార్హం. గతంలో ఈ పాటికి విత్తన పంపిణీ కూడా చేసిన సందర్భాలు ఉన్నాయి. ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ సొంత జిల్లా రైతులకు.. మరీ ముఖ్యంగా పప్పుశనగ సాగు ఎక్కువగా చేసే ఉరవకొండ రైతులకు కూడా విత్తనం ఇవ్వలేని దుస్థితిలో ఉండటం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. గత ఏడాది, ఈ ఖరీఫ్‌లో విత్తన వేరుశనగ, పప్పుశనగ పంపిణీ చేసిన సరఫరా చేసిన ఏజెన్సీలకు రూ.74 కోట్ల బిల్లుల విడుదలలో సర్కారు జాప్యం చేయడంతో రైతులకు విత్తనం అందే పరిస్థితి కనిపించడం లేదు.

ఐసీడీఎస్ ఇన్‌చార్జ్ పీడీగా అరుణకుమారి



అనంతపురం సెంట్రల్: మహిళా,శిశు సంక్షేమశాఖ ఇన్‌చార్జ్ ప్రాజెక్టు డైరెక్టర్‌గా అరుణకుమారిని నియమిస్తూ కలెక్టర్ ఓ.ఆనంద్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఈమె జిల్లా కో ఆపరేటివ్ ఆఫీసర్‌గా పనిచేస్తున్నారు. ఇటీవల శిశుగృహలో నవజాత శిశువు ఆకలి చావుకు గురి కావడంతో ప్రభుత్వం సీరియస్ అయ్యింది. పర్యవేక్షణ లోపమున్నట్లు తేలడంతో పీడీ నాగమణిని సస్పెండ్ చేసింది. ఈ క్రమంలో రెగ్యులర్ పీడీ నియామకం జరిగే వరకూ ఇన్‌చార్జ్ బాధ్యతలను అరుణకుమారికి అప్పగించారు. శుక్రవారం ఈమె బాధ్యతలు తీసుకోనున్నట్లు ఐసీడీఎస్ అధికారవర్గాలు వెల్లడించాయి.

వైద్యానికి 'చంద్ర' గ్రహణం!

- కూటమి ప్రభుత్వంలో రోగుల అవస్థలు
- ఇప్పటికే సమ్మెలో పీహెచ్‌సీ వైద్యులు
- నేటి నుంచి ఎన్టీఆర్ వైద్యసేవలు బంద్

జిల్లాలో 'ఎన్టీఆర్ వైద్యసేవ' బకాయిలు ఇలా..

కాలవ్యవధి	సర్జరీలు	ప్రభుత్వం చెల్లించాల్సిన డబ్బు
2023 ఏప్రిల్ నుంచి 2024 మార్చి	1,13,539	రూ.231.88 కోట్లు
2024 ఏప్రిల్ నుంచి 2025 మార్చి	1,35,344	రూ.247.33 కోట్లు
2025 ఏప్రిల్ నుంచి సెప్టెంబర్	69,839	రూ.132.38 కోట్లు



అనంతపురం సర్వజనాస్పత్రిలో ఓపీ చీటీ పొందేందుకు బారులు తీరిన రోగులు (ఫైల్)

అనంతపురం మెడికల్: కూటమి ప్రభుత్వంలో వైద్య రంగానికి 'చంద్ర'గ్రహణం పట్టుకుంది. ప్రభుత్వం వైద్య రంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేస్తుండడంతో ఇటు ప్రభుత్వ.. అటు ప్రైవేట్ వైద్యుల ఆగ్రహం తారస్థాయికి చేరింది. అందులో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లో వైద్యసేవలు అందించే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల (పీహెచ్‌సీ) వైద్యులు ఇప్పటికే సమ్మెలోకి వెళ్లారు. అలాగే శుక్రవారం నుంచి ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఎన్టీఆర్ వైద్య సేవ (ఆరోగ్యశ్రీ)లను పూర్తి స్థాయిలో ఆపేస్తున్నట్లు ఏపీ స్పెషాలిటీ హాస్పిటల్ అసోసియేషన్ (ఆశా) నేత డాక్టర్ నిరంజన్‌రెడ్డి తెలిపారు.

ఆగనున్న శస్త్రచికిత్సలు

జిల్లాలోని 'వైద్య సేవ' నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో రోజూ 100 నుంచి 200 వరకు శస్త్రచికిత్సలు జరుగుతుంటాయి. అంకాలజీ, న్యూరో సర్జరీ, కార్డియాలజీ, గైనిక్, నెఫ్రాలజీ, తదితర కేసుల్లో ప్రాణాంతకమైన వాటికి సత్వరం శస్త్రచికిత్సలు చేయాల్సి ఉంటుంది. గోల్డెన్ హవర్‌లో వైద్యం అందించకపోతే ప్రాణాలు కోల్పోయే ప్రమాదముంది. కానీ కూటమి ప్రభుత్వం నెట్‌వర్క్ ఆస్పత్రులకు డబ్బు చెల్లించని కారణంగా నేటి (శుక్రవారం) నుంచి 'వైద్యసేవ'లను బంద్ చేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో రోగులు అత్యవసర వైద్యసేవలకు ఎక్కడికి వెళ్లాలన్నది అంతుచిక్కని ప్రశ్నగా మారింది.

సర్వజనాస్పత్రిపై భారం!

ప్రైవేటు ఆస్పత్రుల్లో ఎన్టీఆర్ వైద్యసేవలు బంద్ చేస్తుండడంతో అనంతపురం సర్వజనాస్పత్రిపై తీవ్ర భారం పడే సూచనలు కన్పిస్తున్నాయి. ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచి రోగులు ఎక్కువగా ఇక్కడికి వచ్చే అవకాశముంది. ఈ పరిస్థితుల్లో అధికార యంత్రాంగం సర్వజనాస్పత్రిలో తగిన ఏర్పాట్లు చేయాల్సి ఉంది. రోజూ ఆస్పత్రిలో ఔట్ పేషెంట్లు (ఓపీ) 2,500 నుంచి 3,000, ఇన్ పేషెంట్లు (ఐపీ) 1,100 నుంచి 1,300 మంది వరకు ఉంటారు. ఇప్పటికే ఆస్పత్రి పాలన అస్తవ్యస్తంగా మారింది. కనీస పర్యవేక్షణ కొరవడింది. వైద్యసేవలు నానాటికీ తీసికట్టుగా మారుతున్నాయి. వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా ఈమధ్య కాలంలోనే పలువురు రోగుల ప్రాణాలు గాల్లో కలసిపోయాయి. ఈ పరిస్థితుల్లో అధికార యంత్రాంగం, వైద్య, ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు మొద్దునిద్ర వీడకపోతే పరిస్థితులు మరింత దిగజారే ప్రమాదముంది.

జిల్లాలో 'ఎన్టీఆర్ వైద్యసేవ' నెట్‌వర్క్ ఆస్పత్రులు	46
ఇందులో రోజూ జరిగే శస్త్ర చికిత్సలు	100 నుంచి 200
పీహెచ్‌సీలు మొత్తం	45
సమ్మెలో ఉన్న వైద్యాధికారులు	90

గ్రామీణుల అవస్థలు

పీహెచ్‌సీ డాక్టర్లు కొన్ని రోజులుగా సమ్మె చేస్తున్నారు. జిల్లాలో సుమారు 90 మంది వైద్యాధికారులు విధులకు దూరంగా ఉన్నారు. దీనివల్ల గ్రామీణ ప్రాంతాల్లోని వృద్ధులు, దివ్యాంగులు, మహిళలు, బాలింతలు, గర్భిణులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పీహెచ్‌సీల్లో స్టాఫ్‌నర్సులు, ఫార్మసిస్టులు, అటెండర్లే దిక్కయ్యారు. గత ప్రభుత్వంలో ఇంటి వద్దకే వచ్చి వైద్యం అందించే వారని, ఇప్పుడు ఆస్పత్రులకు వెళ్లినా వైద్యులు అందుబాటులో ఉండడం లేదని ప్రజలు వాపోతున్నారు.

క్లుప్తంగా

కంప చెట్లలో ప్రభుత్వ చక్కెర ఖాళీ ప్యాకెట్లు



ముళ్లకంపలో పడేసిన ప్రభుత్వ చక్కెర ఖాళీ ప్యాకెట్లు

శింగనమల(నార్పల): కార్డుదారులకు చేరాల్సిన నిత్యావసర సరుకులు పక్కదారి పట్టాయి. నార్పల మండలం గూగూడు సమీపంలో గాలి మరల వద్ద ముళ్ల కంపల్లో పడేసిన ప్రభుత్వ చక్కెర ఖాళీ ప్యాకెట్లే ఇందుకు నిదర్శనం. ప్రభుత్వం రేషన్‌కార్డుదారులకు అర కేజీ చొప్పున చక్కెర అందిస్తోంది. అయితే చక్కెరను లబ్ధిదారులకు ఇవ్వకుండా డీలర్లు బహిరంగ మార్కెట్‌లో విక్రయించినట్లు తెలుస్తోంది. గూగూడు సమీపంలో ముళ్ల కంపల్లో దాదాపు 200కు పైగా చక్కెర ఖాళీ ప్యాకెట్లు కనిపించడంతో స్థానికంగా అనుమానాలు వ్యక్తమయ్యాయి.

గంజాయి విక్రేతల అరెస్ట్

- రెండు కిలోల గంజాయి స్వాధీనం



గంజాయి విక్రేతలను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

అనంతపురం: జిల్లా కేంద్రంలో గంజాయి విక్రేయ ముఠా గుట్టురట్టయింది. నగరంలోని నవోదయ కాలనీ హిందూ శ్మశాన వాటిక వద్ద గురువారం విక్రేతలను వన్‌టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి రెండు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు సీఐ జి.వెంకటేశ్వర్లు తెలిపారు. పట్టుబడిన వారిలో రాణినగర్‌కు చెందిన పి.అన్వర్ ఖాన్ కుమారుడు పఠాన్ జాఫర్‌ఖాన్ అలియాస్ గోరా, మున్నానగర్‌కు చెందిన జి.చంద్రశేఖర్ కుమారుడు గొడ్డుమర్రి మహేష్, పాతూరు ప్రభాకర్ స్ట్రీట్‌కు చెందిన జి.బ్రహయ్య కుమారుడు గుర్రం కార్తీక్ అలియాస్ వేణు, టీవీ టవర్ వద్ద ఉన్న ఎన్టీఆర్‌కాలనీకి చెందిన ఎస్.మూర్తి కుమారుడు షికారి కరాది అలియాస్ హరీష్ అలియాస్ హరి, బుడ్డప్ప నగర్ ఒకటో క్రాస్‌కు చెందిన ఎస్.రమేష్ కుమారుడు షికారి అశోక్ అలియాస్ అశోక్, బుడ్డప్ప నగర్ ఒకటో క్రాస్‌కు చెందిన ఎస్.రమేష్ కుమారుడు అలియాస్ షికారి శివాజీ ఉన్నారు. వీరంతా మూడు పదుల వయస్సు లోపు వారే కావడం గమనార్హం. ఇద్దరు మైనర్లను జువైనల్ జస్టిస్ ముందు హాజరు పరిచినట్లు పేర్కొన్నారు.

రైలు పట్టాలపై మృత్యుఘోష!



రవికుమార్ మృతదేహాన్ని పరిశీలిస్తున్న రైల్వే పోలీసులు (ఫైల్)

అనంతపురం – తాటిచెర్ల మార్గంలోని నేషనల్ హైవే బ్రిడ్జి కింద గత సోమవారం గూడ్స్ రైలు కింద పడి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. తొలుత గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్యగా కేసు నమోదు చేసినా... ఆ తర్వాత విచారణలో మృతుడిని అనంతపురం రూరల్ మండలం ఎ.నారాయణపురానికి చెందిన రవికుమార్‌గా గుర్తించారు. ఆయనకు భార్య, ముగ్గురు పిల్లలున్నారన్నారు. ఆర్థికపరమైన ఇబ్బందులు తాళలేక రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నట్లుగా నిర్ధారణ అయింది.

చిలమత్తూరు మండలానికి చెందిన కమలాకర్ (40) గత ఆదివారం రాత్రి కాచిగూడకు వెళ్లేందుకు సిద్ధమై హిందూపురంలో రైలు ఎక్కారు. ధర్మవరం రైల్వే స్టేషన్ రాగానే వాటర్ బాటిల్, టిఫిన్ కొనుగోలు చేసేందుకు దిగాడు. ఈలోపు రైలు కదలడంతో పరుగెత్తుకుంటూ వెళ్లి ఎక్కేందుకు ప్రయత్నించి అదుపు తప్పి కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు.



కమలాకర్ మృతదేహం వద్ద రైల్వే పోలీసులు (ఫైల్)

- పెరుగుతున్న ఆత్మహత్యలు, ప్రమాదాలు
- ఉమ్మడి జిల్లాలో ఏడాదికి సగటున 200 కేసుల నమోదు

రాయదుర్గం: రైలు పట్టాలపై జరుగుతున్న ప్రమాదాలు ఆందోళన కలిగిస్తున్నాయి. అవగాహన లోపం, నిర్లక్ష్యం, క్షణికావేశం కారణంగా ఎంతో మంది ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. ఉమ్మడి అనంత జిల్లా పరిధిలో గుంతకల్లు రైల్వే జోన్ కింద తొమ్మిది రైల్వే స్టేషన్లు ఉన్నాయి. వీటి పరిధిలో సగటున ఏడాదికి 200 కేసులు నమోదు కాగా, ఇందులో 80 శాతానికి పైగా పైగా మరణాలు, 20 శాతం తృటిలో ప్రాణాపాయం నుంచి తప్పించుకుని ఆస్పత్రుల్లో చికిత్స పొందుతూ కోలుకున్నవారు ఉన్నారు. గుంతకల్లు నుంచి బళ్లారి మీదుగా ఓబుళాపురం, సోములాపురం, రాయదుర్గం దాటుకుని కర్ణాటకలోని బెంగళూరుకు ఓ లైను ఉండగా, రాయదుర్గం నుంచి కళ్యాణదుర్గం మీదుగా కదిరిదేవరపల్లి వరకూ మరో లైను, గుంతకల్లు నుంచి గుత్తి మీదుగా అనంతపురం, ధర్మవరం, కదిరి, పుట్టపర్తి, హిందూపురం వరకు మరో లైను ఉంది. వీటి పరిధిలో నిత్యం ఏదో ఓ చోట మృతదేహాలు లభ్యమవుతున్నాయి. పట్టాలు దాటుతూ కొందరు, రైలు నుంచి జారి పడి ఇంకొందరు, క్షణికావేశంలో ఆత్మహత్య చేసుకునే వారు మరికొందరు ఉంటున్నారు. కొన్ని మృతదేహాలు గుర్తించగా, మరిన్ని గుర్తుపట్టడానికి వీలులేకుండా ఉంటున్నాయి. ఇలాంటి అనాథ మృతదేహాలకు రైల్వే పోలీసులే అంత్యక్రియలు నిర్వహిస్తున్నారు.

> **సూచనలు పాటించాలి**
>
> రైల్వే ప్రయాణికులు స్వీయ జాగ్రత్తలు పాటించాలి. ఈ విషయాలపై ఎప్పటికప్పుడు అవగాహన కార్యక్రమాలు చేపట్టి ప్రజలను చైతన్య పరుస్తున్నాం. రైలు కదిలే సమయాన ఎక్కే ప్రయత్నం చేయరాదు. సరైన జాగ్రత్తలు, అప్రమత్తతతో వ్యవహరిస్తే ప్రమాదాల బారిన పడకుండా ఉండవచ్చు. క్షణికావేశంలో ఆత్మహత్య చేసుకోవాలనుకునే వారు ఒక్క క్షణం వారి కుటుంబం గురించి ఆలోచించాలి.
>
> – చంద్ర, రైల్వే ఎస్ఐ, గుంతకల్లు

మాతా శిశు మరణాలపై మండిపాటు

- వాడీవేడిగా 'దిశ'
- శిశుగృహలో పసికందు సహా ఆస్పత్రుల్లో తల్లుల మరణాలపై చర్చ
- బాధ్యులపై కఠిన చర్యలకు సభ్యుల డిమాండ్



మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్, వేదికపై ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ

అనంతపురం సిటీ: అనంతపురం శిశుగృహలో పసికందు ఆకలి చావు ఘటనపై దిశ కమిటీ సమావేశంలో సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో సంచలనం రేకెత్తించిన ఈ ఉదంతంలో ఐసీడీఎస్ పీడీని సస్పెండ్ చేసి అసలైన బాధ్యులను వదిలివేయడాన్ని జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ నిలదీశారు. అనంతపురంలోని డీపీఆర్‌సీ భవన్‌లో గురువారం జిల్లా సమన్వయ దిశ (జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ సమావేశం వాడీవేడిగా జరిగింది. ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి బోయ గిరిజమ్మ, కలెక్టర్ ఆనంద్, సభ్యులు హాజరయ్యారు. జెడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. శిశుగృహలో రెండు నెలల పసికందు ఆకలితో మరణించడం ఆవేదన కలిగిస్తోందన్నారు. ప్రస్తుతం శిశుగృహలో ఆశ్రయం పొందుతున్న చిన్నారుల పరిస్థితిపై అనుమానాలు వ్యక్తం చేశారు. జిల్లాలో విష జ్వరాలు ప్రబలుతున్నాయని, వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని వైద్య ఆరోగ్య శాఖ అధికారులకు సూచించారు. కలెక్టర్ ఆనంద్ మాట్లాడుతూ శిశువు మరణానికి కారణమైన ఉద్యోగులందరిపై చర్యలు ఉంటాయన్నారు.

ఉపాధిలో అక్రమాలు

ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఉపాధి హామీ పథకంలో రూ.కోట్లు మింగుతున్నారని, దీనిపై అధికారులు కనీస చర్యలు తీసుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉపాధి పథకాన్ని వ్యవసాయంతో అనుసంధానం చేయాలని బోయ గిరిజమ్మ కోరారు. నల్లరేగడి భూములున్న రైతులకు సబ్సిడీపై పప్పుశనగ సరఫరా చేయాలని బెళుగుప్ప ఎంపీపీ పెద్దన్న విజ్ఞప్తి చేశారు. వర్షాలతో దెబ్బతిన్న మొక్కజొన్న దిగుబడులను ప్రభుత్వమే కొనుగోలు చేయాలని సభ్యులు డిమాండ్ చేశారు. పలు మున్సిపాలిటీలకు తాగునీటి సరఫరాకు ఏటా రూ.70 నుంచి రూ.80 కోట్ల వరకు జెడ్పీ చెల్లిస్తున్నా నీటి పన్ను జెడ్పీకి జమ చేయకుండా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు వాడుకుంటున్నారని, దీంతో జెడ్పీ అప్పుల ఊబిలో కూరుకుపోతోందని సభ దృష్టికి గిరిజమ్మ తెచ్చారు.

బాధ్యతారాహిత్యంగా మాట్లాడతారా?

ట్రాన్స్‌కో ఎస్ఈపై కలెక్టర్ ఆనంద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సభ్యుల ప్రశ్నలకు సరైన సమాధానం ఇవ్వకుండా బాధ్యతరాహిత్యంగా సమాధానాలు ఇస్తే చార్జ్ మెమో ఇస్తానంటూ హెచ్చరించారు. ప్రధాన రహదారుల పక్కనే ఫుట్‌పాత్ వదలకుండా విద్యుత్ స్తంభాలు నాటుతున్నారని కంబదూరు జెడ్పీటీసీ నాగరాజు సభ దృష్టికి తీసుకురాగా.. ట్రాన్స్‌కో ఎస్ఈ ఆర్‌అండ్‌బీ అధికారులపై నిందలు వేస్తూ మాట్లాడటాన్ని తీవ్రంగా పరిగణించారు.

ప్రజారోగ్యంతో చెలగాటమా?

- ఎక్సైజ్ పోలీసుస్టేషన్ వద్ద ధర్నాలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు



ఎక్సైజ్ ఎస్ఐకు వినతి పత్రం ఇస్తున్న వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చిన్నబాబు

గుంతకల్లు: విచ్చలవిడిగా కల్తీ మద్యం విక్రయిస్తూ ప్రజారోగ్యంతో కూటమి ప్రభుత్వం చెలగాటమాడుతోందని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.గాదిలింగేశ్వరబాబు (చిన్నబాబు), మున్సిపల్ మాజీ చైర్మన్ జింకల రామాంజనేయులు ధ్వజమెత్తారు. కల్తీ మద్యంను అరికట్టాలని, కల్తీ మద్యం సేవించి మృతి చెందిన బేల్దారి పెద్దన్న కుటుంబాన్ని ఆదుకోవాలంటూ గుంతకల్లు మాజీ ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి ఆదేశాలతో గురువారం గుంతకల్లులోని రాజేంద్రనగర్‌లో ఉన్న ఎక్సైజ్ కార్యాలయం వద్ద పట్టణ వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. కార్యక్రమానికి పట్టణ కన్వీనర్ ఎండీఆర్ ఖలీల్ అధ్యక్షత వహించారు. వక్తలు మాట్లాడుతూ.. 1994 ఎన్టీఆర్ హయాంలో మద్యపాన నిషేధం అమలు చేస్తే.. ఆయనను వెన్నుపోటు పొడిచి అధికారం చేపట్టిన చంద్రబాబు మద్యపాన నిషేధం ఎత్తివేసి విచ్చలవిడిగా విక్రయాలను ప్రోత్సహించారని గుర్తు చేశారు. మద్యంను అంచెలంచెలుగా తగ్గించాలనే ఉద్దేశ్యంతో 2019 నుంచి 2024 వరకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే నిర్వహిస్తూ బెల్ట్‌షాపులను పూర్తిగా కట్టడి చేసిందన్నారు. ప్రస్తుతం డబ్బు సంపదనే ధ్యేయంగా కల్తీ మద్యం వ్యాపారాన్ని కూటమి ప్రభుత్వం ప్రోత్సహిస్తోందన్నారు. కల్తీ మద్యం సేవించి మృతి చెందిన బేల్దారి పెద్దన్న కుటుంబానికి రూ.10 లక్షలు పరిహారం చెల్లించడంతో పాటు బెల్ట్‌షాపులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎక్సైజ్ ఎస్ఐ ఎం.వెంకటేశులకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు లింగన్న, జేసీబీ చాంద్ బాషా, వార్డు ఇన్‌చార్జులు యల్లప్ప, సాయిపోగు వీరేష్, నాయడు, నాయకులు అబ్దుల్‌బాసిద్, రంగనాయకులు, మౌలా, బాబురావు, గోవిందునాయక్, జయరామిరెడ్డి, బావన్న, కసాపురం వంశీ, పవన్, నాగాంజనేయులు, యల్లన్న, నూర్‌నిజామి, ఆర్‌డీజీ బాషా, డ్యామ్‌వలి, ఖాసీమ్, సర్పంచులు నారాయణస్వామి, ఈసునాయక్, ఎంపీటీసీ రమేష్‌నాయక్, జి.శాంతిరాణి, సునీతబాయి పాల్గొన్నారు.

కూడేరు సీఐని సస్పెండ్ చేయాలి

- లేకపోతే ఈ నెల 13న జిల్లా కేంద్రంలో ధర్నా
- మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే విశ్వ

అనంతపురం కార్పొరేషన్: అసాంఘిక కార్యకలాపాలను అరికట్టకుండా కేవలం వైఎస్సార్‌సీపీ శ్రేణులే లక్ష్యంగా అక్రమ కేసులు బనాయిస్తూ దౌర్జన్యానికి పాల్పడుతున్న కూడేరు సీఐ రాజాని తక్షణమే సస్పెండ్ చేయాలని ఉరవకొండ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి డిమాండ్ చేశారు. సీఐ రాజా పని తీరుపై గతంలోనూ ఎస్పీ జగదీష్ దృష్టికి తీసుకెళ్లామని, అయినా అతనిపై ఎలాంటి చర్యలూ తీసుకోకపోవడంతో మరింత రెచ్చిపోతున్నారని మండిపడ్డారు. జిల్లా వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మంత్రి పయ్యావుల కేశవ్ సోదరుడు పయ్యావుల శ్రీనివాసులు కనుసన్నల్లోనే సీఐ రాజా పని చేస్తున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ శ్రేణులను టీడీపీలోకి చేరాలని, లేకుంటే కేసులు బనాయించి ఇబ్బందులకు గురి చేస్తామంటూ సీఐ బాహాటంగానే హెచ్చరికలు జారీ చేస్తున్నారన్నారు. పోలీసు స్టేషన్‌ను సివిల్ పంచాయితీలకు కేంద్రీకృతం చేస్తూ.. నిందితులు, భూ కబ్జాదారులు, దౌర్జన్యకారులకు వంత పాడుతున్నారన్నారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, తదితర నాయకులను దుర్భాషలాడడమే కాకుండా రౌడీ షీట్ ఓపెన్ చేస్తామంటూ బెదిరింపులకు పాల్పడుతున్నారన్నారు. ఇన్ని దౌర్జన్యాలు చేయడం కంటే పోలీసు స్టేషన్లను టీడీపీ కార్యాలయాలుగా మారిస్తే బాగుంటుందంటూ ఎస్పీ జగదీష్‌కు సూచించారు.

చేతనైతే హామీలు అమలు, అభివృద్ధి చర్యలు చేపట్టాలి

మంత్రి కేశవ్ పెద్ద ఎత్తున జూదం ఆడిస్తున్నారని, ఇందులో పోలీసులకూ వాటా ఉందని విమర్శించారు. ఒక్క రోజైనా జూద గృహాలపై సీఐ దాడులు చేయకపోవడమే ఇందుకు నిదర్శనమన్నారు. ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతూ సారా, తదితర వాటిని విక్రయిస్తున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ నేతల కుటుంబాల్లో ఉన్న కలహాలను ఆసరాగా చేసుకుని పోలీసుల సాయంతో టీడీపీలోకి చేర్చుకోవాలని చూడడం సరికాదన్నారు. చేతనైతే సూపర్‌సిక్స్ హామీల అమలు, ఉరవకొండ నియోజకవర్గ అభివృద్ధికి చర్యలు తీసుకుని ప్రజలను ఆకట్టుకోవాలని కేశవ్‌కు హితవు పలికారు. కురుబ గోవిందుకు చెందిన 24 ఎకరాల భూమిలోకి వెళ్లకుండా టీడీపీ నాయకులు దౌర్జన్యం చేస్తుంటే సీఐ ప్రేక్షకపాత్ర పోషిస్తున్నారన్నారు. ఇప్పటికైనా కూడేరు సీఐను సస్పెండ్ చేయకపోతే ఈ నెల 13న జిల్లా కేంద్రంలో కూడేరు ప్రాంత ప్రజలతో కలసి పెద్ద ఎత్తున ధర్నా కార్యక్రమాన్ని చేపడుతామని హెచ్చరించారు. అనంతరం పలువురు బాధితులు మాట్లాడుతూ.. సీఐ రాజా దౌర్జన్యాలను వివరించారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి సీపీ వీరన్న, కూడేరు మండల కన్వీనర్ బైరెడ్డి రామచంద్రారెడ్డి, కూడేరు ఎంపీపీ నారాయణరెడ్డి, మాజీ జెడ్పీటీసీ మేరీనిర్మలమ్మ, నాయకులు పాల్గొన్నారు.

యువకుడి అనుమానాస్పద మృతి

- హత్య చేశారంటున్న కుటుంబ సభ్యులు



మృతుడు మహేష్

ఉరవకొండ: మండలంలోని లత్తవరం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుడు తిరుమలేష్, గురుశాంతమ్మ దంపతుల కుమారుడు కొడిగి మహేష్(28) గురువారం అనుమానాస్పదస్థితిలో మృతదేహమై కనిపించాడు. గొర్రెల మేపునకు ఉదయం వెళ్లిన మహేష్ సాయంత్రమైనా ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు గాలింపు చేపట్టారు. మహేష్ సెల్‌ఫోన్ కూడా రింగ్ అవుతుంది తప్ప.. ఎత్తకపోవడంతో కుటుంబ సభ్యుల్లో మరింత ఆందోళన మొదలైంది. ఈ క్రమంలో గ్రామంలోని హంద్రీ–నీవా కాలువ సమీపంలో గుట్టల్లో తీవ్ర రక్తగాయాలతో బోర్ల పడి ఉన్న మహేష్‌ను గమనించిన స్థానికుల సమాచారంతో కుటుంబ సభ్యులు అక్కడకు చేరుకుని అక్కడకు చేరుకుని పరిశీలించారు. మహేష్ మృతిచెందినట్లుగా నిర్ధారించుకుని బోరున విలపించారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక సీహెచ్‌సీకి తరలించారు. మృతదేహాన్ని పరిశీలించిన సీఐ మహానంది, ఎస్ఐ జనార్దననాయుడు... విద్యుత్ షాక్‌తో మృతి చెంది ఉంటాడనే అనుమానాలు వ్యక్తం చేశారు. దీంతో మృతుడి పెద్దనాన్న, వైఎస్సార్‌సీపీ జిల్లా నేత కొడిగి గోవిందుతో పాటు తల్లిదండ్రులు, బంధువులు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. కుట్ర పన్ని తమ బిడ్డను హతమార్చి విద్యుత్ షాక్ అంటూ మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఘటనపై పోలీసులు అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

భూసారం పెంపుపై విద్యార్థులకు అవగాహన

అనంతపురం అగ్రికల్చర్: విచ్చలవిడి రసాయనాలు, పురుగు మందుల వాడకం కారణంగా భూమి నిస్సారమై పంట దిగుబడులు తగ్గిపోవడం, పెట్టుబడులు పెరగడం, ప్రజారోగ్యం, పర్యావరణ పరిరక్షణకు విఘాతం కలుగుతున్నట్లు గుర్తించిన కేంద్ర ప్రభుత్వం భూసారం పెంపునకు ప్రత్యేక ప్రణాళిక రచించింది. భావితరాలకు బంగారు భూమి అందించే లక్ష్యంతో విద్యార్థి దశ నుంచే భూసారంపై అవగాహన పెంచడానికి 'స్కూల్ సాయిల్ హెల్త్ ప్రోగ్రాం–ఎస్ఎస్‌హెచ్‌పీ) అమలు చేస్తోంది. ఇందులో భాగంగా జిల్లా వ్యాప్తంగా 13 పాఠశాలలను ఎంపిక చేయగా ఇందులో కురుగుంట గురుకుల పాఠశాల, రజాపురం గురుకుల పాఠశాల, కంబదూరు మండలం తిమ్మాపురం పాఠశాల, కళ్యాణదుర్గం, గార్లదిన్నె, కణేకల్లు క్రాస్, నార్పల మండలం బి.పప్పూరు, పామిడి, రాయదుర్గం, శెట్టూరు, వజ్రకరూరు, గుత్తిలోని ఏపీ మోడల్ స్కూళ్లు, ఉరవకొండలోని ఓ పాఠశాల ఉన్నాయి. ప్రధానంగా 8, 9, 10 వ తరగతి విద్యార్థులకు మొదట భూసార పరీక్షలు, మట్టి సేకరణ, వాటి ప్రయోజనాలపై అవగాహన కల్పించి, పాఠశాల పరిధిలో మట్టి పరీక్షలు విశ్లేషించి సాయిల్ హెల్త్‌కార్డు తయారు చేయించి రైతులకు వాటిని అందించనున్నట్లు సాయిల్ టెస్టింగ్ ల్యాబ్ (ఎస్‌టీఎల్) ఏడీఏ రోజాపుష్పలత తెలిపారు.

డీఆర్‌ఎం కార్యాలయం ఎదుట నేడు నిరసన

గుంతకల్లు: రైల్వే విశ్రాంత ఉద్యోగుల డిమాండ్ల సాధనకు గుంతకల్లులోని డీఆర్‌ఎం కార్యాలయం ఎదుట శుక్రవారం ఉదయం 11.30 గంటలకు నిరసన కార్యక్రమాన్ని చేపట్టనున్నారు. ఈ మేరకు గుంతకల్లు డివిజన్ ఆల్ ఇండియా రిటైర్డ్ రైల్వేమెన్స్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి వి.సుంకప్ప గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు పెన్షన్‌ను రద్దు చేసే అధికారం ఏ ప్రభుత్వానికి లేదని, పెన్షన్ అనేది ప్రభుత్వ ఉద్యోగి హక్కు అనే నినాదంతో నిరసన కార్యక్రమాన్ని చేపట్టనున్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రైల్వే విశ్రాంత ఉద్యోగులకు సుంకప్ప పిలుపునిచ్చారు.

సమానత్వం ప్రతి ఇంటి నుంచి రావాలి



మాట్లాడుతున్న సినీ దర్శకుడు ఉమామహేశ్వరరావు


అనంతపురం కల్చరల్: మహిళల సమానత్వమనేది ప్రతి ఇంటి నుంచి లింగ వివక్ష లేకుండా తల్లుల ద్వారానే రావాలని సినీ దర్శకుడు ఉమామహేశ్వరరావు అన్నారు. ఐద్వా రాష్ట్ర మహాసభలు అనంత వేదికగా సాగుతున్న నేపథ్యంలో మూడురోజుల పాటూ జరిగే సాంస్కృతిక ఉత్సవాలు గురువారం రాత్రి ఘనంగా ప్రారంభమయ్యాయి. స్థానిక కృష్ణ కళామందిరం వేదికగా జరిగిన సమావేశానికి ఉమామహేశ్వరరావు ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. దాడులు, అత్యాచారాలను సమర్థవంతంగా ఎదుర్కోవడానికి ప్రతి మహిళా సిద్ధమయ్యేటట్లు ఐద్వా చేస్తున్న కృషిని అభినందించారు. ఆత్మీయ అతిథులుగా విచ్చేసిన డీఆర్వో మలోల, లలిత కళాపరిషత్తు కార్యదర్శి గాజుల పద్మజ, డాక్టర్ ప్రసూన, ఐద్వా రాష్ట్ర నాయకురాలు సావిత్రి తదితరులు మాట్లాడారు. అంతకు ముందు మహిళల పోరాట స్ఫూర్తిని ప్రతిబింబిస్తూ ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్ ఆలోచింపజేసింది. అనంతరం పలు సాంస్కృతిక కార్యక్రమాలతో కళాకారులు ఆకట్టుకున్నారు. నిర్వాహకులు డాక్టర్ ప్రగతి, సీపీఎం రాంభూపాల్, రామాంజనమ్మ, నల్లప్ప, వన్నూర్ మాస్టర్, తదితరులు పాల్గొన్నారు.

ఫీజుల కోసం వేధిస్తే చర్యలు

- ఇంటర్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణ అధికారి

అనంతపురం ఎడ్యుకేషన్: విద్యార్థులను ఫీజుల కోసం వేధింపులకు గురిచేస్తే చర్యలు తప్పవని ప్రైవేట్ అన్ ఎయిడెడ్ జూనియర్ కళాశాలల యాజమాన్యాలను ఇంటర్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణ అధికారి వెంకటరమణనాయక్ హెచ్చరించారు. ఫిర్యాదులు అందిన నేపథ్యంలో నారాయణ కళాశాలతో పాటు వివిధ కళాశాలలను గురువారం ఆయన తనిఖీ చేశారు. దసరా సెలవుల తర్వాత కళాశాలలకు చేరుకున్న విద్యార్థులను ఫీజులు కడితేనే అనుమతిస్తామంటూ తల్లిదండ్రులపై ఒత్తిళ్లు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఇంటర్మీడియట్ విద్యామండలి సూచించిన పరీక్ష ఫీజు కన్నా అధిక ఫీజులు వసూలు చేస్తున్నట్లు కూడా తెలిసిందన్నారు. పరీక్ష ఫీజు అదనంగా వసూళ్లు చేస్తే కళాశాల గుర్తింపు రద్దు చేసేందుకు సిఫార్సు చేస్తామని హెచ్చరించారు. కళాశాల ఫీజు కట్టకున్నా విద్యార్థులను అనుమతించాలన్నారు. పరీక్ష ఫీజు కట్టించుకోవాలన్నారు.

గుత్తి విద్యార్థికి రూ. 51 లక్షల ప్యాకేజీతో ఉద్యోగం



దాదా ఖలందర్

గుత్తి: గుత్తి పట్టణానికి చెందిన షేక్ బాషా, రహమత్ దంపతుల కుమారుడు దాదా ఖలందర్‌కు రూ. 51 లక్షల వార్షిక ప్యాకేజీతో ఉద్యోగం ఆఫర్ దక్కింది. హైదరాబాద్‌లోని బిట్స్ పిలానీ కళాశాలలో బీటెక్ సెకెండియర్ చదువుతున్నాడు. కళాశాలలో ఇటీవల నిర్వహించిన క్యాంపస్ డ్రైవ్‌లో ప్రతిభ కనబరిచి ఏఎండీ కంపెనీలో ఉద్యోగ అవకాశాన్ని దక్కించుకున్నాడు. బీటెక్ పూర్తయిన తర్వాత ఉద్యోగంలో చేరనున్నట్లు సమాచారం.

యాడికిలో వరుస చోరీలు

యాడికి: మండల కేంద్రంలోని ఐదు ఇళ్లలో వరుస చోరీలు చోటు చేసుకున్నాయి. బుధవారం రాత్రి ఇద్దరు దుండగులు నెత్తికి రుమాలు చుట్టుకుని తాళం వేసిన గృహాలను లక్ష్యంగా చేసుకుని చోరీలకు పాల్పడ్డారు. కమ్మవీధిలోని వద్ది కృష్ణమూర్తి ఇంట్లో 50 తులాల వెండి, తమ్మినేటి రాజగోపాల్ నాయుడు ఇంట్లో రూ.4వేల నగదు, వెండి దీపాలు, కలశం, శాంతి నగర్‌లోని ఓబయ్య కుమారుడు పోతురాజు రాజయ్య ఇంట్లో రూ.37వేల నగదు, ఒక తులం బంగారు చైను, ఒక జత వెండి కాళ్ల పట్టీలు, సుమయాన్ ఇంట్లో రూ.10వేల నగదు, 2 తులాల బంగారం, కోన రోడ్డులోని కోటేష్ కుమారుడు గంగవరం శివ ఇంట్లో వెండి కాళ్ల పట్టీలు, వెండి మొలతాడును అపహరించారు. గురువారం ఉదయం సమాచారం అందుకున్న పోలీసులు చోరీ జరిగిన 5 ఇళ్లను పరిశీలించి కేసులు నమోదు చేశారు.

క్లుప్తంగా

రేపు 'హాస్యభారతి'

అనంతపురం కల్చరల్: నవ్వులు పూయించే 'హాస్యభారతి' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు హాస్యరచయిత తరిమెల అమరనాథరెడ్డి, యోగాకేంద్రం అధ్యక్షులు మెళవాయి రాజశేఖరరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 10.30 గంటలకు చర్చి స్కూల్ సమీపంలో ఉన్న షిరిడీనగర్‌లోని వివేకానంద యోగభవన్ వేదికగా సాగే హాస్యభారతి కార్యక్రమానికి హాస్యప్రియులు విచ్చేయాలని కోరారు. అనంతకు చిరస్థాయి హాస్యాన్ని, జానపదకళా వైభవాన్ని అందించిన అమళ్లదిన్నె గోపీనాథ్ స్మారకంగా సుధాకర మూర్తికి హాస్యభారతి పురస్కారమందిస్తున్నామని వెల్లడించారు.

సీసీ రోడ్లకు భూమి పూజ



సీసీ రోడ్డుకు భూమి పూజ చేస్తున్న ఎంపీడీఓ విజయలక్ష్మి

రాప్తాడు: మండల కేంద్రమైన రాప్తాడులో పలు సీసీ రోడ్లకు గురువారం ఎంపీడీఓ విజయలక్ష్మి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... రూ. 46 లక్షల ఉపాధి హామీ నిధులతో గ్రామంలో నాలుగు సీసీ రోడ్లకు భూమి పూజ చేస్తున్నామన్నారు. త్వరలోనే పనులు ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శమంతకమణి, సర్పంచు తిరుపాలు తదితరులు పాల్గొన్నారు.

సీబీఐతో విచారణ చేయించాలి

అనంతపురం టవర్‌క్లాక్: రాష్ట్ర వ్యాప్తంగా నకిలీ మద్యం సేవించి ఎంతోమంది ప్రాణాలు కోల్పోయారని, ఈ విషయంపై సీబీఐతో విచారణ జరిపించాలని ఆర్‌ఈఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షుడు పోతుల నాగరాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ధనార్జన కోసం నకిలీ మద్యం తయారు చేయడం దుర్మార్గమన్నారు. ఇలాంటి విషయాలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

తపాలా సేవలపై చైతన్యం



ఆధార్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న సూపరింటెండెంట్ అమర్‌నాథ్

అనంతపురం సిటీ: ప్రపంచ తపాలా దినోత్సవాన్ని పురస్కరించుకుని అనంతపురంలోని ఆ శాఖ కార్యాలయంలో సూపరింటెండెంట్ అమర్‌నాథ్ ఆధ్వర్యంలో తపాలా సేవలపై చైతన్య కార్యక్రమాలను గురువారం నిర్వహించారు. తపాలా ఉత్పత్తులు, సేవలపై ర్యాలీ చేపట్టారు. హెడ్ పోస్టాఫీసు ఆధార్ కేంద్రంలో అందించే సేవలను కేంద్రం ఇన్‌చార్జ్ అరుణ వినియోగదారులకు వివరించారు. ఇక్కడి ఆధార్ కేంద్రంతో పాటు విశ్వభారతి స్కూల్లో బాలికల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఆధార్ బయోమెట్రిక్ శిబిరాన్ని సూపరింటెండెంట్ పరిశీలించారు. అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఉమామహేశ్వర్, విశ్వభారతి స్కూల్ ప్రిన్సిపాల్ ఆయేషా సుల్తానా, పోస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.

13న స.హ.చట్టంపై ర్యాలీ

అనంతపురం టవర్‌క్లాక్: సమాచార హక్కు చట్టం-2005పై ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించే ర్యాలీని విజయవంతం చేయాలని జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి పిలుపునిచ్చారు. గురువారం స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద పోస్టర్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా సాకే హరి మాట్లాడుతూ చట్టం అమలులో ప్రభుత్వం, అధికారుల వైఖరికి నిరసనగా ఈ నెల 13న టవర్ క్లాక్ నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహిస్తామన్నారు. కుల, ప్రజా సంఘాలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో కేపీ రాజు, సుగమంచి శ్రీనివాసులు, వన్నూరప్ప, టీవీ రెడ్డి, రాయల కొండయ్య, రామకృష్ణ, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కురుగుంటలో పేకాట కేంద్రంపై దాడి

- తొమ్మిది మంది జూదరుల అరెస్ట్

సాక్షి ఎఫెక్ట్..

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండలం కురుగుంట వైఎస్సార్ కాలనీలో పేకాట కేంద్రంపై పోలీసులు గురువారం దాడి చేశారు. ఇందిరమ్మ విగ్రహం సమీపంలోని ఓ ఇంట్లో కొద్దిరోజులుగా పేకాట జరుగుతున్న వైనంపై గురువారం 'సాక్షి'లో 'పేకాటరాయుళ్లతో బెంబేలు' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనికి పోలీసు అధికారులు స్పందించారు. ఎస్‌ఐ రాంబాబు నేతృత్వంలో సిబ్బంది వెళ్లి దాడులు చేశారు. మొత్తం తొమ్మిది మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.40,500 నగదు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం కోర్టులో హాజరుపరిచారు. కాగా.. ఇక్కడ పేకాట నిర్వహిస్తున్న వ్యక్తికి తమదైన శైలిలో కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ ప్రాంతంలో ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు తెలిస్తే తమకు సమాచారం అందించాలని ఎస్‌ఐ కోరారు.

కలెక్టరేట్ వద్ద కేటుగాళ్ల దందా



ఇతని పేరు పి.కాటమయ్య. నార్పల మండలం మంగపట్నం గ్రామం. భూ సమస్యపై పరిష్కార వేదికలో అర్జీ సమర్పించేందుకు రెండు వారాల క్రితం కలెక్టరేట్‌కు వచ్చాడు. ఈ క్రమంలో ఓ వ్యక్తి పలకరించి తనను తాను రెడ్డి శంకర్‌గా పరిచయం చేసుకున్నాడు. సమస్య తెలుసుకుని ఇదేమి పెద్దది కాదని, ఆర్డీఓతో చెప్పి చేయిస్తానంటూ భూమి పత్రాలు నకలు కాపీలు తీసుకున్నాడు. అదే సమయంలో ఖర్చులకని రూ.10 వేలు తీసుకున్నాడు. ఏ విషయమైనా తనకు ఫోన్ చేయాలంటూ 9490377042 నంబర్ ఇచ్చాడు. ఆ తర్వాత ఆర్డీఓ కార్యాలయంలో ఇవ్వాలంటూ ఓ సారి రూ.7,500, మరోసారి సర్వేయర్‌ను పిలుచుకు వస్తున్నానంటూ రూ.4 వేలు, ఇలా... రూ.30 వేల వరకూ దండుకున్నాడు. గత ఆదివారం ఫోన్ చేస్తే మాట్లాడి... ఆ తర్వాత స్విచ్ ఆఫ్ చేశాడు. దీంతో తాను మోసపోయినట్లుగా నిర్ధారించుకుని బాధితుడు గురువారం మరోసారి కలెక్టరేట్‌కు వచ్చి సదరు వ్యక్తి గురించి ఆరా తీశాడు.

- పరిష్కార వేదికకు వచ్చే ప్రజలే 'టార్గెట్'
- పని చేయిస్తామంటూ నమ్మించి డబ్బులు వసూల
- అటు తరువాత కనిపించకుండా పోతున్న మోసగాళ్లు
- కలెక్టరేట్ చుట్టూ తిరుగుతున్న బాధితులు



అర్జీలు సమర్పించేందుకు కలెక్టరేట్‌కు వచ్చిన ప్రజలు (ఫైల్)

అనంతపురం అర్బన్: కలెక్టరేట్‌లో నిర్వహిస్తున్న ప్రజాసమస్యల పరిష్కార వేదికలో అర్జీ అందజేసి సమస్యకు పరిష్కారం పొందేందుకు జిల్లా నలుమూలల నుంచి ప్రతి సోమవారం వందలాది మంది ప్రజలు వస్తుంటారు. వీరి అవసరాన్ని కొందరు మోసగాళ్లు తమకు అనుకూలంగా మార్చుకుని పైసా వసూల్‌కు తెరలేపారు. గతంలో ఓ మహిళ వద్ద నుంచి ఒక వ్యక్తి రూ.25 వేలు వసూలు చేశాడు. కరోనాతో ఆమె భర్త చనిపోయాడు. దీంతో ఆమెకు ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తానంటూ నమ్మించి సదరు వ్యక్తి డబ్బు వసూలు చేయడం గమనార్హం. అటు తరువాత అతను కనిపించకపోవడంతో మోసపోయినట్లుగా తెలుసుకున్న ఆమె వన్‌టౌన్ పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో అప్పటి ఏఎస్‌ఐ వెంకటకృష్ణ, కానిస్టేబుల్ భగీరథ ప్రత్యేక చొరవ తీసుకుని కేవలం నాలుగు గంటల వ్యవధిలోనే ఆ వ్యక్తిని ఆత్మకూరు వాసిగా గుర్తించారు. ఫోన్ చేసి హెచ్చరించి డబ్బులు రాబట్టుకుని బాధితురాలికి ఇప్పించారు. మరో ఘటనలో ఉద్యోగం ఇప్పిస్తామని నమ్మించి ఓ యువతి వద్ద నుంచి ఒక వ్యక్తి రూ.2 లక్షలు వసూలు చేశాడు. ఆ తర్వాత బాధితురాలు తన తల్లితో కలిసి కలెక్టరేట్‌కు చేరుకుని ఆ వ్యక్తి గురించి విచారణ చేయడంతో అతను మోసగాడని తెలిసి కన్నీటిపర్యంతమయ్యారు.

సమస్యకు పరిష్కారం ఏదీ?

డబ్బులు ఇస్తే అధికారులతో చెప్పి పనిచేయిస్తామంటున్న కేటుగాళ్లను కట్టడి చేసే దిశగా అధికారులు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు. ఇందుకు పరిష్కార వేదిక కౌంటర్ల వద్ద హెచ్చరిక బోర్డులు పెట్టాలని సూచిస్తున్నారు. అలాగే మైక్ అనౌన్స్‌మెంట్ చేయించడం ద్వారా ప్రజలను చైతన్యపరచవచ్చునంటున్నారు.

అలసత్వం ప్రదర్శిస్తే చర్యలు తప్పవు

- జాయింట్ కలెక్టర్ శివనారాయణ శర్మ



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ శివనారాయణ శర్మ

అనంతపురం కల్చరల్: గ్రంథాలయాల్లో పనిచేస్తున్న అధికారులు, సిబ్బందికి మధ్య సమన్వయం కొరవడిందని, విధుల్లో అలసత్వం ప్రదర్శిస్తే చర్యలు తప్పవని జాయింట్ కలెక్టర్ శివనారాయణ శర్మ హెచ్చరించారు. గురువారం కేంద్ర గ్రంథాలయంలో వార్షిక బడ్జెట్ సర్వసభ్య సమావేశం జరిగింది. గ్రంథాలయాల అభివృద్ధికి రూపొందించిన నివేదికపై జేసీ అసంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లా గ్రంథాలయ సంస్థ ఇన్‌చార్జ్‌గా వ్యవహరిస్తున్న జేసీ శివనారాయణ శర్మ మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు గ్రంథాలయాలు అండగా నిలవాలని, పోటీపరీక్షలకు తగిన మెటీరియల్ లైబ్రరీలలో ఉండేలా చూడాలని ఆదేశించారు. సిబ్బంది బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలన్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను 17.12 కోట్లతో బడ్జెట్ రూపొందించినట్లు తెలిపారు. గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలు గ్రంథాలయ సెస్సు చెల్లించాలన్నారు. జిల్లాలోని గ్రంథాలయాల అభివృద్ధికి దాతలు సహకారమందించాలని కోరారు. సమావేశంలో విద్యాశాఖ డిప్యూటీ డైరెక్టర్ వెంకటేష్, డిప్యూటీ డీఈవో శ్రీనివాసరావు, డీపీవో ఏవో సోమశేఖర్, గ్రంథాలయ కార్యదర్శి రమ తదితరులు పాల్గొన్నారు.

బోధనేతర కార్యక్రమాలు చేపట్టం



ఎంఈఓకు వినతిపత్రం అందజేస్తున్న ఫ్యాప్టో నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్: ఉపాధ్యాయులకు మితిమీరిన బోధనేతర కార్యక్రమాలతో బోధనా సమయం హరించుకుపోతోందని ఫ్యాప్టో నగర కమిటీ నాయకులు వాపోయారు. రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా శుక్రవారం నుంచి బోధనేతర కార్యక్రమాలను బహిష్కరిస్తున్నట్లు వెల్లడించారు. ఈ మేరకు గురువారం అనంతపురం ఎంఈఓ వెంకటస్వామిని కలిసి నోటీసు అందజేశారు. ఉపాధ్యాయులకు బోధనపై ఆసక్తి తగ్గిపోయేలా బోధనేతర కార్యక్రమాలు పెరిగిపోయాయని వాపోయారు. ఎన్నిమార్లు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసినా, ఏమాత్రం పట్టించుకోలేదన్నారు. ఉపాధ్యాయుల హాజరు, విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించిన పనులు మాత్రమే ఉపాధ్యాయులు చేపడతారన్నారు. అలాగే మూల్యాంకనానికి సంబంధించిన పరీక్షల నిర్వహణ తప్ప, బోధనేతర పనులు గాని అనవసరమైన గూగుల్ షీట్స్ నింపడం గానీ, విద్యాశక్తి, జీఎస్టీ 2.0 లాంటి సీజనల్ ప్రచార కార్యక్రమాలు చేపట్టబోమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఫ్యాప్టో నగర నాయకులు రామాంజనేయులు, శ్రీనివాసులు, ఓబులేసు. నాయక్, ఫణి భూషణ్, తులసిరెడ్డి, జనార్దన్, ఆదిశేషు, భాగ్యరాజు, యుగంధర్, గోవర్ధన్, విరుపాక్షి గౌడ్, మల్లికార్జున, నాగభూషణం పాల్గొన్నారు.

సూపర్ సేవింగ్స్‌పై అవగాహన కల్పించాలి

- మంత్రి పయ్యావుల కేశవ్



మాట్లాడుతున్న మంత్రి పయ్యావుల కేశవ్

అనంతపురం కార్పొరేషన్: 'సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్' కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. గురువారం మంత్రి కేశవ్ టవర్‌క్లాక్ వద్ద ఉన్న పలు మందుల షాపులను పరిశీలించారు. 'వన్ నేషన్..వన్ ట్యాక్స్' అనేది చరిత్రాత్మక నిర్ణయమన్నారు. జీఎస్టీ సంస్కరణల ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి రూ. 8 వేల కోట్లు ఆదా అవుతున్నాయన్నారు. మెడికల్‌లో 15 శాతం వరకు ప్రజలకు సేవింగ్స్ కల్పించేలా చూశారన్నారు. మంత్రి వెంట ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, కలెక్టర్ ఓ. ఆనంద్ తదితరులున్నారు.

ఆస్పత్రుల్లో అవగాహన

అనంతపురం మెడికల్: 'సూపర్ జీఎస్టీ.. సూపర్ సేవింగ్స్'పై గురువారం జిల్లాలోని ప్రభుత్వ సర్వజనాస్పత్రి, ఏరియా ఆస్పత్రులు, సీహెచ్‌సీలు, పీహెచ్‌సీల్లో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. జిల్లా కేంద్రంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఈ భ్రమరాంబ దేవి, ఆయా ఆస్పత్రుల్లో వైద్యాధికారులు జీఎస్టీ సేవింగ్స్‌పై ఊకదంపుడు ఉపన్యాసాలిచ్చారు. దీంతో ఆస్పత్రులకు వచ్చే రోగులకు వైద్యం అందించడంలో తీవ్ర జాప్యం జరిగింది. కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ యుగంధర్, ఓబులు, ఏఓ గిరిజా మనోహర్ రావు, డెమో నాగరాజు, డిప్యూటీ డెమో గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

కుమ్మర రామాంజి వేధింపులు అరికట్టాలి

- పంచాయతీ కార్మికుల ఆందోళన



కుమ్మర రామాంజనేయులుకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న పంచాయతీ కార్మికులు

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండలం పాపంపేటలో టీడీపీ చోటా నాయకుడు కుమ్మర రామాంజనేయులు వేధింపులు అరికట్టాలని పంచాయతీ కార్మికులు డిమాండ్ చేశారు. గురువారం నారాయణపురం పంచాయతీ కార్యాలయం ఎదుట కార్మికులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాపంపేట ప్రాంతంలో 40 మంది కార్మికులు, ఇద్దరు మేస్త్రీలు పని చేస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రోజు నుంచి వీరంతా తన చెప్పు చేతుల్లో ఉండాలంటూ కుమ్మర రామాంజనేయులు అజమాయిషీ చేస్తున్నాడన్నారు. చెప్పినట్టు వినకుంటే పనికిరావొద్దంటూ హెచ్చరిస్తున్నాడన్నారు. మహిళా కార్మికులను అసభ్య పదజాలంతో దూషిస్తున్నాడని వాపోయారు. ఆయనకు ప్రస్తుత పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్ వత్తాసు పలుకుతున్నాడని ఆరోపించారు. మేస్త్రీ అమర్‌నాథ్ కూడా ఇదే విధంగా కార్మికులను ఇబ్బందులకు గురి చేస్తున్నాడని, ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకోకుంటే సీఐటీయూ ఆధ్వర్యంలో ఆందోళనలు తీవ్రతరం చేయడంతో పాటు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఏపీ పంచాయతీ ఉద్యోగ, కార్మిక సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి శివ ప్రసాద్, గౌరవ అధ్యక్షులు టి.గోపాల్, కార్మికులు మధు, పెద్దన్న,కుళ్లాయమ్మ, ఆదెప్ప, వరలక్ష్మీ, సునీత, లక్ష్మీదేవి, నారాయణమ్మ, హేమలత, ఆదిలక్ష్మీ,లక్ష్మీనరసమ్మ తదితరులు పాల్గొన్నారు.

'నారాయణ' ఆగడాలు అరికట్టాలి

- ఆర్‌ఐఓ కార్యాలయాన్ని ముట్టడించిన ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు



ఆర్‌ఐఓ కార్యాలయం గేటు ముందు కూర్చుని నిరసన తెలియజేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్: నారాయణ విద్యా సంస్థల ఫీజుల ఒత్తిడి, దోపిడీని అరికట్టాలని డిమాండ్ చేస్తూ ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో గురువారం ఇంటర్ బోర్డు ఆర్‌ఐఓ కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు తరిమెల గిరి, ప్రధాన కార్యదర్శి ఓతూరు పరమేష్ మాట్లాడుతూ ఇంటర్ విద్యార్థులకు పరీక్ష తేదీలను ఖరారు చేసి.. పరీక్ష ఫీజు కట్టించుకోవడానికి ప్రభుత్వం సర్క్యులర్ జారీ చేసిందన్నారు. దీన్ని అవకాశంగా తీసుకున్న ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులను, వారి తల్లిదండ్రులను మానసిక వేదనకు గురి చేస్తున్నాయన్నారు. మొత్తం ఫీజులో 80 శాతం చెల్లిస్తేనే పరీక్ష ఫీజు కట్టించుకుంటామని, ప్రాక్టికల్స్ సంబంధించిన రికార్డులు ఇస్తామని బెదిరిస్తున్నాయన్నారు. నారాయణ విద్యా సంస్థల్లో ఫీజుల కోసం ఒత్తిడి మరీ ఎక్కువగా ఉందన్నారు. ఇప్పటికైనా ఆర్‌ఐఓ స్పందించి కళాశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో భవిష్యత్తు ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తామని హెచ్చరించారు.

పదోన్నతిపై బదిలీ

అనంతపురం రూరల్: జిల్లా గిరిజన సంక్షేమ శాఖ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న సురేష్‌ను పదోన్నతిపై కర్నూలు జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి (డీటీడబ్ల్యూఓ)గా బదిలీ చేశారు. ఈ మేరకు ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన త్వరలో రిలీవ్ కానున్నట్లు జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి శ్రీనివాసరావు తెలిపారు.

మా బంగారం ఏమైంది?

- నిందితుడిని నిలదీసిన బాధితులు
- నచ్చచెప్పిన పోలీసులు

అనంతపురం: తమ బంగారం ఏమైందంటూ నిందితులను బాధితులు నిలదీశారు. ఇటీవల అనంతపురంలోని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు రామ్‌నగర్ బ్రాంచ్‌లో ఓ ఖాతాదారుడికి సంబంధించి ఒక గోల్డ్‌ప్యాకెట్ ట్యాంపర్ అయింది. ఒరిజినల్ బంగారు స్థానంలో నకిలీ బంగారాన్ని పెట్టినట్లు బ్యాంకు అధికారులు గుర్తించారు. బ్యాంకు మేనేజర్ ఫిర్యాదు మేరకు నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు పక్కా ఆధారాలతో అనంతపురం నగరంలోని రాణి నగర్‌కు చెందిన వి. సతీష్‌కుమార్, బోయ హెచ్. జయరాములు, సాయి కృష్ణ, బోయ శ్రీనివాసులు అలియాస్ శీనను రెండు నెలల కిందట పోలీసులు అరెస్ట్ చేశారు.

ఎలా అపహరించారంటే..

కీర్తన ఫైనాన్స్ సంస్థలో పనిచేస్తున్న నరేష్, సతీష్ కుమార్ ఇద్దరూ కలిసి కదిరిలో మణప్పురం ఫైనాన్స్ సంస్థలో పనిచేసేవారు. విలాసాలు, జల్సాలు తీర్చుకునేందుకు సులువుగా డబ్బు సంపాదించాలనుకున్నారు. సతీష్‌కుమార్ తన క్లాస్‌మేట్ సాయి కృష్ణతో పాటు పరిచయమున్న బోయ శ్రీనివాసులు, హెచ్‌డీఎఫ్‌సీలో పనిచేస్తున్న జయరాంతో కలిసి పథకం రచించారు. బ్యాంక్‌లో బంగారాన్ని తాకట్టు పెట్టేందుకు వచ్చిన ఖాతాదారులను ఏమార్చి కీర్తన ఫైనాన్స్‌కు మళ్లించి రుణం పొందేవారు. ఇలా జయరాం పేరిట 330 గ్రాములు, బోయ శ్రీనివాసులు పేరిట 650 గ్రాములు, సాయి కృష్ణ పేరిట 1200 గ్రాములు కీర్తన ఫైనాన్స్‌లో తాకట్టు పెట్టారు. నిందితులను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించగా.. బెయిల్‌పై ఇటీవల విడుదలయ్యారు. ఈ క్రమంలో సతీష్ అనే వ్యక్తి గురువారం ఖాతాదారుల కంటపడ్డాడు. దీంతో కోపోద్రిక్తులైన ఖాతాదారులు సతీష్‌ను నిలదీశారు. 'మా బంగారం ఏమైంది' అంటూ గట్టిగా అడిగారు. అతడిని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు వద్దకు పిలుచుకుని వెళ్లారు. ఇంతలో పోలీసులు జోక్యం చేసుకుని నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్‌కు అందరినీ తీసుకెళ్లారు. కోర్టు నుంచి అనుమతి తీసుకుని చట్టబద్ధంగా బంగారు ఇచ్చేలా చర్యలు తీసుకుంటామని నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్ సీఐ జగదీష్ పేర్కొనడంతో ఖాతాదారులు శాంతించి వెనుదిరిగారు.

12న 'దశాబ్ద ఐక్యత-భవిష్యత్తు పోరాట సభ'

అనంతపురం ఎడ్యుకేషన్: ఏపీ సమగ్రశిక్ష కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ జేఏసీ ఏర్పడి పదేళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ నెల 12న విజయవాడలో 'దశాబ్ద ఐక్యత-భవిష్యత్తు పోరాట సభ' నిర్వహిస్తున్నట్లు జేఏసీ జిల్లా అధ్యక్షుడు వి.ఓబిరెడ్డి, ప్రధానకార్యదర్శి హెచ్.రామన్న తెలిపారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. సమగ్రశిక్ష కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులతో పలు పనులు చేయించుకుంటున్న ప్రభుత్వాలు.. చిన్నపాటి సౌకర్యాలు కల్పించే విషయంలో మాత్రం 'ఉద్యోగులు కాదు.. స్కీం వర్కర్లు' అంటూ పక్కన పెడుతున్నాయని వాపోయారు. ఈ అన్యాయమైన వైఖరిని వెంటనే మార్చుకోవాలని, తమను విద్యాశాఖలో విలీనం చేయాలని డిమాండ్ చేశారు. విజయవాడ సభకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సమగ్ర శిక్ష, పాఠశాల విద్యాశాఖ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు తరలిరావాలని పిలుపునిచ్చారు.

మానసిక ఒత్తిడితో అనర్థాలు

ఆత్మకూరు: మానసిక ఒత్తిడితో ఎన్నో అనర్థాలు జరుగుతాయని, అందువల్ల ఒత్తిడిని దరిచేరనీయవద్దని విద్యార్థులకు వక్తలు సూచించారు. ప్రపంచ మానసిక దినోత్సవం సందర్భంగా గురువారం స్థానిక కస్తూర్బా పాఠశాలలో విద్యార్థినులకు మానసిక ఒత్తిడి..దాన్ని ఎలా అధిగమించాలో అవగాహన కల్పించారు. పరీక్షల్లో ఒత్తిడిని ఎలా ఎదుర్కోవాలన్న విషయాలను క్లుప్తంగా వివరించారు. కార్యక్రమంలో కెరీర్, మెంటల్ హెల్త్ కౌన్సిలర్ యాస్మిన్ తాజ్, ప్రహ్లాద్, కేజీబీవీ ప్రిన్సిపాల్ లీమారోజ్ తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపుతో ఉద్రిక్తత



టీపీఓ శిరీషను నిలదీస్తున్న దృశ్యం

అనంతపురం కార్పొరేషన్: స్థానిక పెన్నార్ భవన్ సమీపంలోని చిరు వ్యాపారాలను ఆక్రమణల పేరుతో నగర పాలక సంస్థ టౌన్ ప్లానింగ్ అధికారులు తొలగించడానికి పూనుకోవడంతో ఉద్రిక్తత తలెత్తింది. గురువారం టీపీఓ శిరీష ఆదేశాలతో టౌన్ ప్లానింగ్ సిబ్బంది ఆక్రమణలను తొలగించాలని చూశారు. దీంతో వైఎస్సార్ సీపీ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర నేత కేవీ రమణ, జిల్లా అధ్యక్షుడు ఓబిరెడ్డి, నాయకులు లింగాల రమేష్, సీపీఐ నాయకులు రమణ, గాదిలింగ తదితరులు అడ్డుకున్నారు. ఏళ్ల తరబడి వ్యాపారాలు చేసుకుంటున్న వారిని ఆక్రమణల పేరుతో తొలగించడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. నగరంలో నిబంధనలకు విరుద్ధంగా అనేక నిర్మాణాలు జరుగుతున్నాయని, వాటి విషయంలో ఒక ఇటుక పెళ్ల అయినా తొలగించారా అని టీపీఓ శిరీషను నిలదీశారు. వందల సంఖ్యలో నిర్మాణాలకు చార్జ్‌షీట్లు వేసి ఇంత వరకు ఎందుకు పట్టించుకోలేదని ప్రశ్నించారు. డబ్బులున్న వారు ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘించి సర్కారు ఆదాయానికి గండికొడుతున్నా పట్టించుకోని మీరు.. పేదలు, చిరు వ్యాపారుల విషయంలో మాత్రం దారుణంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. దీంతో టీపీఓ శిరీష నీళ్ల నమిలారు. ఫిర్యాదు రావడంతో ఆక్రమణలు తొలగించాల్సి వచ్చిందంటూ మాట దాటవేశారు.

యోగాతో మానసిక ఉల్లాసం

అనంతపురం రూరల్: యోగా, ధ్యానం చేయడం వల్ల మానసిక ఉల్లాసం కలుగుతుందని కెరీర్ అండ్ మెంటల్ హెల్త్ కౌన్సిలర్ వీరాంజినేయులు అన్నారు. గురువారం రుద్రంపేట పంచాయతీ పరిధిలోని పంతుల కాలనీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రపంచ మానసిక ఆరోగ్య వారోత్సవాలను నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

భవనాన్ని పరిశీలించిన ఎస్పీ

అనంతపురం : నగరంలోని కోర్టురోడ్డులో మహిళా పోలీసుస్టేషన్ పాత భవనాన్ని జిల్లా ఎస్పీ జగదీష్ గురువారం పరిశీలించారు. సదరు భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో నిరుపయోగంగా వదిలేశారు. విలువైన ఈ ప్రాంతంలో కొత్త భవనం నిర్మించడంపై ఎస్పీ దృష్టి సారించారు. అలాగే వెనుక వైపు సిబ్బంది క్వార్టర్స్, ఖాళీ స్థలాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో అర్బన్ డీఎస్పీ శ్రీనివాసరావు, ఏఆర్ డీఎస్పీ నీలకంఠేశ్వరరెడ్డి, సీఐలు శ్రీకాంత్, వెంకటేష్‌నాయక్ తదితరులున్నారు.

చెత్త సేకరణలో నిర్లక్ష్యం తగదు

రాప్తాడు: ఇంటింటా చెత్త సేకరణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని జిల్లా పరిషత్ సీఈఓ జి.శివ శంకర్ అధికారులను హెచ్చరించారు. గురువారం ఆయన ప్రసన్నాయపల్లిలో పర్యటించారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పరిసరాల పరిశుభ్రతపై అందరూ ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఎంపీడీఓ విజయలక్ష్మి, ఇన్‌చార్జ్ ఈఓఆర్డీ ప్రేమ్ కుమార్, పంచాయతీ కార్యదర్శి మమత తదితరులు పాల్గొన్నారు.

కసాపురం క్షేత్రంలో మెరుగైన సౌకర్యాల కల్పన

- సీఎస్‌కు తెలిపిన కలెక్టర్ ఆనంద్

అనంతపురం అర్బన్: కసాపురం ఆంజనేయస్వామి క్షేత్రంలో భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్‌కు కలెక్టర్ ఓ.ఆనంద్ తెలిపారు. గురువారం విజయవాడ నుంచి వివిధ అంశాలపై కలెక్టర్లతో సీఎస్ సమీక్షించారు. స్థానిక కలెక్టరేట్ నుంచి కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ, డీఆర్‌ఓ ఎ.మలోల, ఇతర అధికారులు పాల్గొన్నారు. కసాపురం ఆలయానికి రూ.9 కోట్ల ఆదాయం వస్తోందన్నారు. 192 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారన్నారు. ప్రసాదం, ఇతరత్రాలకు రూ.3 కోట్లు ఖర్చు అవుతోందని తెలిపారు. సమావేశంలో పీఆర్ ఎస్‌ఈ సుబ్బరాయుడు, జెడ్పీ సీఈఓ శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానంతోనే అభివృద్ధి

రాప్తాడు: ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటేనే అభివృద్ధి సాధ్యమని, ఈ మేరకు విద్యార్థులు కృషి చేయాలని జేఎన్‌టీయూ(ఏ) అధ్యాపకులు డాక్టర్ కళ్యాణి, డాక్టర్ ఓం ప్రకాష్ సూచించారు. గురువారం వారు మండలంలోని గొల్లపల్లి సమీపంలోని మాంటిస్సోరీ ఎలైట్ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో 'కంప్యూటర్ టెక్నాలజీ- అవర్ స్మార్ట్ హెల్ప్ నెస్' అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. వారిని కళాశాల యాజమాన్యం ఘనంగా సన్మానించింది. కార్యక్రమంలో పాఠశాల ఎండీ కృష్ణ భరత్, ప్రిన్సిపాల్ ప్రతాప్ రెడ్డి, పాఠశాల అకాడమిక్ డీన్ మధు, విద్యార్థులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

ఆత్మకూరు: పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని, ఈ మేరకు గర్భిణులు, బాలింతలకు అంగన్‌వాడీ సిబ్బంది అవగాహన కల్పించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లావణ్య సూచించారు. గురువారం మండలంలోని సిద్దరాంపురం, పి. యాలేరు గ్రామాల్లో 'పోషణ్ మహ్' కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

యువకుడి దుర్మరణం

రాప్తాడు: టిప్పర్ కిందపడి ఓ యువకుడు దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు.. అనంతపురంలోని రుద్రంపేటలో నివాసముంటున్న చిట్రా వరప్రసాద్ (41), బంగారు నాగరత్న దంపతులకు ఇద్దరు కుమారులు ఉన్నారు. శారీ సెంటర్ నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో చిట్రా వరప్రసాద్ గురువారం మధ్యాహ్నం ద్విచక్ర వాహనంపై రాప్తాడు మండలం హంపాపురంలో ఉన్న బంధువుల ఇంటికి వెళ్లాడు. అక్కడ పని ముగించుకుని రుద్రంపేటకు తిరుగు ప్రయాణమైన ఆయన హంపాపురం క్రాస్‌లో 44వ జాతీయ రహదారిని దాటుతుండగా అనంతపురం వైపుగా వెళుతున్న టిప్పర్ వెనుక నుంచి ఢీకొంది. ప్రమాదంలో చిట్రా వరప్రసాద్ అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

సాక్షి
ఫ్యామిలీ
అనంతపురం
శుక్రవారం ॥ 10-10-2025


కుమార్తె నితారాతో అక్షయ్ కుమార్

సైబర్ వలయం

ముందే పాఠం నేర్చుకుందాం


**ఇప్పుడు ప్రపంచం వైఫైలో బందీ!
ఆ వైఫైయే సెల్‌ఫోన్‌కు ఆహారం..
ఆ సెల్‌ఫోనే అందరికీ ప్రాణాధారం!
రియల్ లైఫ్ కన్నా వర్చువల్ వరల్డ్‌లోనే శ్వాసిస్తున్నాం!
పిల్లలకైతే చెప్పక్కరలేదు..
చదువు - సంధ్య, ఆట - పాట అంతా డిజిటల్ డివైజే!
అందుకే ఆన్‌లైన్‌లో అవతలివైపు వాళ్లకు
అవలీలగా దొరికిపోతున్నారు..
ఆటవస్తువులుగా మారుతున్నారు!
ఈ ప్రమాదానికి సెలబ్రిటీల పిల్లలూ వల్నరబులే..
ప్రైవసీ కంచె వాళ్లను కాపాడలేకుంది!
తాజా ఉదాహరణ.. బాలీవుడ్ నటుడు అక్షయ్ కుమార్
కూతురు నితారా కుమార్‌కు ఎదురైన అనుభవమే!**

అక్షయ్ కుమార్ కూతురు నితారాకు పదమూడేళ్లు. అందరి పిల్లల్లాగే ఆ అమ్మాయికీ ఆన్‌లైన్ గేమ్స్ అంటే మహా ఇష్టం. అమ్మ ట్వింకిల్ ఖన్నా అనుమతితో రోజులో కొంచెంసేపు ఆన్‌లైన్ గేమ్స్‌తో ఎంటర్‌టైన్ అవుతూంటుంది. ఎప్పటిలాగే ఆ రోజూ గేమ్‌స్టార్ట్ చేసింది. అవతలి వైపు నుంచి ఓ అపరిచితుడు అమ్మాయికి గేమ్ పార్ట్‌నర్‌గా చేరాడు. గేమ్ ఆడుతూ నితారాతో సంభాషణ మొదలుపెట్టాడు. 'చాలా స్మార్ట్‌గా ఆడుతున్నావ్.. వెరీ గుడ్' అంటూ ప్రశంసించాడు. 'థాంక్స్' చెప్పింది నితారా. ఇంకో రెండుమూడు క్యాజువల్ మాటల తర్వాత 'నువ్వు అమ్మాయివా? అబ్బాయివా?' అంటూ అడ్వాన్స్ అయ్యాడు. 'అమ్మాయిని' అంటూ బదులిచ్చింది నితారా. 'ఒకసారి నీ ఫొటోగ్రాఫ్స్ పంపవా?' అని అడిగాడు. ఏదో అపశ్రుతి పసిగట్టిన ఆ అమ్మాయి వెంటనే డివైజ్ షట్‌డౌన్ చేసి, విషయాన్ని తల్లికి చెప్పింది. 'నా కూతురు చేసిన తెలివైన పని అదే. డివైజ్ క్లోజ్ చేసి ఆ ఆన్‌లైన్ అబ్యూజ్‌ను తల్లితో షేర్ చేసుకోవడం' అంటాడు అక్షయ్ కుమార్. సైబర్ అవేర్‌నెస్ మంత్ క్యాంపెయిన్‌లో మాట్లాడుతూ తన కూతురు ఎదుర్కొన్న పరిస్థితిని వివరించాడు అక్షయ్ కుమార్.


సుహానా ఖాన్, షారూఖ్ ఖాన్, గౌరీఖాన్


అజయ్ దేవ్‌గన్, నైసా, కాజోల్


అభిషేక్, ఐశ్వర్య, ఆరాధ్య


అనుష్క, విరాట్, వమికా

పాఠ్యాంశంగా..

అక్షయ్, ట్వింకిల్ ఖన్నా ఇద్దరూ క్రమశిక్షణకు మారుపేరు. పిల్లలిద్దరినీ మీడియాకు దూరంగానే ఉంచుతారు. వాళ్ల ప్రైవసీకే ప్రాధాన్యం ఇస్తారు. అయినా నితారా ఆన్‌లైన్ అబ్యూజ్‌ను ఎదుర్కొంది. అంత కంటికి రెప్పలా కాచుకుంటేనే ఇలాంటి సిచ్యుయేషన్ వస్తే.. తల్లిదండ్రులిద్దరూ ఉద్యోగాలు చేసే ఇళ్లల్లో పిల్లల సంగతి ఎలా ఉంటుందో! 24 గంటలు కాదు కదా.. కనీసం ఇంట్లో ఉన్నప్పుడు కూడా పర్యవేక్షించలేనంత బిజీగా ఉంటున్నారు పేరెంట్స్. అందుకే స్కూళ్లల్లో సైబర్ సేఫ్టీని పాఠ్యాంశంగా చేర్చాలంటున్నాడు అక్షయ్ కుమార్.

ఎందుకంటే పిల్లల స్క్రీన్ టైమ్ మీద నియంత్రణ లేకపోతే సైబర్ ట్రోలింగ్, బుల్లీయింగ్, అబ్యూజ్‌కి గురయ్యే ప్రమాదం ఎలాగూ ఉంటుంది. దానితో పాటు అది పిల్లల శారీరక, మానసిక ఆరోగ్యం పై, వాళ్ల సోషల్ బిహేవియర్ మీదా దుష్ప్రభావం చూపిస్తుందని పలు అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. కాబట్టి అక్షయ్ కుమార్ చెప్పినట్టు పిల్లలకు బడిలో పుస్తక పాఠాలతో పాటు సైబర్ బిహేవియర్ జాగ్రత్తలనూ నేర్పించాలని చైల్డ్ సైకాలజిస్టలూ సూచిస్తున్నారు. అంతేకాదు పెద్దలకూ ఆన్‌లైన్ అవేర్‌నెస్ మీద వర్క్‌షాప్స్‌ను నిర్వహించాలని.. సైబర్ క్రైమ్ పోలీసులే దీని మీద చొరవ చూపాలని కోరుతున్నారు.

> కనీస అవసరాల నుంచి ఫ్లయిట్ టికెట్స్ దాకా, బడి పాఠాల నుంచి ప్రొఫెషనల్ మీటింగ్స్ దాకా అన్నిటికీ ఆన్‌లైనే మాధ్యమం. అలాంటి ఈ డిజిటల్ యుగంలో పిల్లల జోక్యాన్ని నివారించడం అసాధ్యమే. కానీ దాని మంచి చెడు, వ్యక్తిగత డేటాను ఎలా కాపాడుకోవాలి, ఆన్‌లైన్ భద్రత కోసం ఏం చేయాలి.. వంటి అంశాల మీద అవగాహన కల్పించడం మాత్రం సాధ్యమే! అత్యవసరం కూడా!

వీళ్లు కూడా..

షారూఖ్ ఖాన్ కూతురు సుహానా ఖాన్ నుంచి కాజోల్, అజయ్ దేవ్‌గన్‌ల కూతురు నైసా దేవ్‌గన్, ఐశ్వర్య రాయ్, అభిషేక్ బచ్చన్‌ల కూతురు ఆరాధ్యా బచ్చన్, అనూష్కా శర్మ, విరాట్ కోహ్లీల కూతురు పసికూన వమికా దాకా అందరూ ఆన్‌లైన్ ట్రోలింగ్, బుల్లీయింగ్‌కి గురైనవారే. సుహానా ఖాన్ ఒంటి రంగు, యాక్టింగ్ స్కిల్స్‌ను వెక్కిరిస్తూ ట్రోల్ చేశారు. నైసా దేవ్‌గన్ కూడా ఒంటిరంగు పట్ల ఆన్‌లైన్ హేళనకు గురైంది. ఆరాధ్యనయితే బాడీషేమింగ్ చేశారు. కెమెరా ముందు నిలబడటం రాదని ఎద్దేవా చేశారు. దీన్ని సీరియస్‌గా తీసుకుని ఐశ్వర్య సైబర్ పోలీసులకు ఫిర్యాదూ చేశారు. ఆ మాటలు, వెక్కిరింతలు ఆరాధ్య మనసును గాయపరచి ఆమె మానసిక ఆరోగ్యాన్ని ఎఫెక్ట్ చేస్తాయని.. ఐశ్వర్య కూతురిని డిజిటల్ మాధ్యమానికి దూరంగా ఉంచారు. కనీసం ఫోన్ కూడా వాడదు ఆరాధ్య. ఈ విషయాన్ని ఒక సందర్భంలో స్వయంగా అభిషేక్ బచ్చనే ప్రస్తావించారు. భార్యకు బెస్ట్ మదర్‌గా కితాబూ ఇచ్చారు. నటులు దియా మిర్జా, సమీరా రెడ్డి కూడా పేరెంట్స్‌గా.. పిల్లల స్క్రీన్ టైమ్ మీద నియంత్రణ ఉండాలని, దాన్నెలా ఫాలో కావాలో, పేరెంటింగ్‌లో ఎలా భాగం చేయాలో పేరెంట్స్‌కి నిపుణులు వర్క్‌షాపులు నిర్వహించి అవగాహన పెంపొందించాలని కోరుతున్నారు.





ఫ్యాషన్

● ఇయర్ చెయిన్స్

మెరిసే సరాలు







**రమణుల ఆభరణాల అలంకరణలో చెవుల నుంచి హెయిర్ వరకు లేయర్లుగా చెయిన్ ఉండటం ఫ్యాషన్ మాత్రమే కాదు మన సంస్కృతి, సౌందర్యం, ఆచారం కూడా.
దక్షిణ భారతదేశంలో చెంపసరాలు, మాటీలుగా పేరున్న ఈ ఇయర్ చెయిన్స్ బాలీవుడ్ నుంచి టాలీవుడ్ సెలబ్రిటీల వరకు ఇప్పుడు స్పెషల్ అట్రాక్షన్‌గా మారాయి.
ఇటీవల దుర్గా నవరాత్రుల్లో సెలబ్రిటీలు ధరించిన మాటీల అందం నవతరపు చూపులను ఇట్టే కట్టిపడేసింది.
ప్రాచీన ఆభరణంగా, అలంకరణలో సంపూర్ణతకు చిహ్నంగా నిలిచే మాటీలు వివాహ వేడుకలలో వధువు సింగారంలో తప్పనిసరై వెలుగొందుతోంది.
పండగల రోజులలో ధరించిన డ్రెస్సుల తగిన ట్రెండీ మోడల్స్ కూడా ఇప్పుడు మార్కెట్లో అందుబాటులోకి వచ్చాయి.
బంగారం, డైమండ్స్‌లోనే కాదు వివిధ రకాల పూసలు, సిల్వర్, ఆక్సిడైజ్‌లలోనూ ఈ మాటీల అందం మనసు దోచేస్తుంది.**









సాంప్రదాయ ఆభరణాలకు మోడర్న్ మెరుపులు జోడించడమే ఈ ఇయర్ చెయిన్స్. ఒకప్పుడు దేవతల విగ్రహాల్లో, అమ్మమ్మల చెవులకు కనిపించిన చెంప సరాలు ఇప్పుడు రన్ వే వేదికలపై అడుగులు వేసే మోడల్స్ చెవుల్లో, మ్యాజిక్ ఫెస్టివల్ లుక్స్‌లో, బ్రైడల్ ఫొటోషూట్లలో కొత్త శైలిలో మెరిసిపోతున్నాయి. దక్షిణ భారతీయ సంప్రదాయాల్లో చెంప సరాలు (ఇయర్ చెయిన్)ఒక ముఖ్యమైన అలంకారం. నాటి కాలంలో మహిళల గౌరవం, ఆభరణ సంపూర్ణతకు చిహ్నంగా వెలుగొందిన చెంప సరాలు రాబోయే వేడుకలలో మరిన్ని ఆకర్షణలను జోడించనున్నాయి.

■ **అద్దుకున్న ఆధునికత**

ఈ రోజుల్లో ఆ చెంప సరాలు కొత్త రూపాల్లో కనిపిస్తున్నాయి. సిల్వర్, ఆక్సిడైజ్డ్, మెరూన్ కలర్ పూసలు, ముత్యాల చెయిన్లు, ఫ్యూషన్ ఫ్యాషన్‌లో కూడా ఇయర్ చెయిన్స్ స్పెషల్ లుక్ ఇస్తున్నాయి. సాదా సీదా కుర్తా మీదకైనా, లెహంగా లేదా చీర ధరించినా ఆభరణాల అలంకరణలో ఇయర్ చెయిన్ అందం జత చేరితే ఆ అందం ఇనుమడిస్తుంది.

■ **శక్తి సరాలు..**

ఇది కేవలం అలంకారం కాదు. చెవులు-జుట్టు ప్రదేశంలో ఈ సరాలు కదలడం మన ప్రాణశక్తిని సమతుల్యం చేస్తుందని చెబుతారు. అందుకే కొంతమంది దీనిని 'శక్తి సరాలు'గా భావిస్తారు.

■ **సెలబ్రిటీల స్టైల్ టచ్**

బాహుబలి సినిమాలో అనుష్క ధరించిన చెవి జూకాలు, చెంప సరాలు ఎంతో మందిని ఆకట్టుకున్నాయి. అలాగే, ఇటీవల దుర్గా నవరాత్రుల్లో బాలీవుడ్ నుంచి టాలీవుడ్ వరకు సెలబ్రిటీలైన అలియా భట్, జాన్వీకపూర్, సోనమ్‌కపూర్, శోభిత ధూళిపాల, నయనతార... లాంటి నటీమణులు తమ ట్రెడిషనల్ ఫొటోషూట్లలో ఇయర్ చెయిన్స్ ధరించి ట్రెండ్ సెట్ చేశారు. ఆ లుక్స్ వల్లే ఈ పాత ఆభరణం మళ్లీ యంగ్ జనరేషన్‌లో పాపులర్ అయింది. పాత ఆభరణానికి కొత్త రూపం దక్కింది. ఇప్పుడు వాటి డిజైన్, మెటీరియల్, వాడుక అన్నీ ఫ్యాషన్ ప్రపంచంలో కొత్త భాషను పరిచయం చేస్తున్నాయి.

ఇప్పుడు కొంతమంది కళాకారులు రీసైకిల్ మెటల్, హ్యాండ్ మేడ్ ఫ్యాబ్రిక్ థ్రెడ్స్‌తోనూ వీటిని రూపొందిస్తున్నారు. అమ్మమ్మల నాటి సంప్రదాయ నెమలి, మామిడిపిందెల నుంచి ప్రారంభమైన చెంప సరాల డిజైన్లు ఈ రోజుల్లో ఇయర్ కఫ్స్ వరకు వినూత్నంగా కళ్లకు కడుతున్నాయి.

కేర్‌గివర్

రాణి అనే నేను ఇజ్రాయెల్ నుంచి మాట్లాడుతున్నాను...



ఇజ్రాయెల్ అనే మాట వినిపించగానే యుద్ధబీభత్సాలు, దాడులు గుర్తుకు వస్తాయి. కొద్దిమంది నెటిజనులకు మాత్రం ఇజ్రాయెల్ అనగానే టక్కున గుర్తుకు వచ్చే పేరు రాణి గోర్సెర. 'ఇజ్రాయెల్‌లో కేర్‌గివర్‌గా పనిచేస్తున్నాను' అని చెప్పే రాణి సోషల్ మీడియాలో చురుగ్గా ఉంటుంది.

ఎప్పటికప్పుడూ ఆసక్తికరమైన వీడియోలు ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేస్తుంటుంది.

'కేర్‌గివర్'గా వృద్ధులను కన్నబిడ్డలా చూసుకుంటుంది. ఇళ్లు శుభ్రం చేయడం, వంట చేయడం, వృద్ధులతో కబుర్లు చెప్పడం... ఇలా ఎన్నో చేస్తూ ఉంటుంది.

'కేర్‌గివర్‌గా నా జీవితంలో ఒకరోజు' కాప్షన్‌తో ఇన్‌స్టాగ్రామ్‌లో చేసిన వీడియోలో కబుర్లు చెబుతూ, నవ్విస్తూ, ఒక వృద్ధురాలి కాళ్లని శుభ్రం చేయడం, నెయిల్ పెయింట్ వేయడం.. .మొదలైన దృశ్యాలు కనిపిస్తాయి.

నవరాత్రి ఉత్సవాలలో ఉత్సాహంగా నృత్యం చేయడం మరో వీడియోలో కనిపిస్తుంది.

'చాలామంది వృద్ధులు ఒంటరితనం అనే దీవిలో దిగులుగా జీవిస్తున్నారు. అలాంటి వారికి రాణిలాంటి వారు సరికొత్త జీవనోత్సాహాన్ని ఇస్తున్నారు. వృత్తిపరంగా ఆమె కేర్‌గివర్ కావచ్చు గానీ వృద్ధులకు ఆమె ఆత్మీయతను పంచే కన్నకూతురు' అని ఒక నెటిజన్ కామెంట్ రాశారు.

జర్నీ

భారత్ పిలిచింది!



బ్రెయిన్ ట్యూమర్ బారిన పడిన యూకే అథ్లెట్ జాక్ ఫెంట్‌కు ప్రతికూల ఆలోచనలు వస్తుండేవి. ఆ సమయంలోనే తనకు ఇష్టమైన ఇండియా గుర్తుకు వచ్చింది. వెంటనే రంగంలో దిగాడు.

'ఇండియా–80 రోజులు–4,000 కిలోమీటర్లు' కార్యక్రమానికి శ్రీకారం చుట్టాడు.

ఇండియాలోకి అడుగు పెట్టిన క్షణం నుంచి అతడిలో ఉత్సాహం మొదలైంది. ఇండియాలో తన '80-డే రన్' తాలూకు వీడియోలను ఎప్పటికప్పుడు సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తున్నాడు. 'ప్రొటెక్టర్' కాప్షన్‌తో పోస్ట్ చేసిన వీడియోలో తనను ప్రమాదం నుంచి రక్షించిన వీధి శునకం గురించి చెప్పాడు.

ఆ శునకంతో తనతోపాటు పదమూడు కిలోమీటర్లు నడిచింది. దానికి 'మనాలి' అని పేరు పెట్టాడు జాక్.

'80 రోజులలో రోజుకు 50 కిలోమీటర్ల దూరం పరుగెత్తడానికి ఇండియాకు ప్రయాణమవుతున్నాను. మంచుతో కప్పబడిన కొండల నుంచి కేరళ ప్రకృతి అందాల వరకు ఎన్నో చూడబోతున్నాను. బ్రెయిన్ ట్యూమర్ అని నాకు నిర్ధారణ అయిన తరువాత నా మనసు భయం, గందరగోళం, దుఃఖంతో నిండిపోయింది. నాకే కాదు భూమి మీద ప్రతి ఒక్కరికీ కష్టాలు కూడా ఉంటాయి. దీంతో పాటు ఒక ఆప్షన్ కూడా ఉంటుంది. ఇండియాకు వెళ్లాలనుకోవడం అనేది నా ఎంపిక. మళ్లీ పూర్వంలా ఉత్సాహంగా ఉండాలనుకుంటున్నాను'' అని తన యాత్ర ప్రారంభానికి ముందు షేర్ చేసిన పోస్ట్‌లో రాశాడు జాక్ పెయింట్.

మనసు మాట విందాం!

నేడు ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం



మన సమాజంలో దగ్గు, జలుబు, జ్వరం, షుగర్, బీపీ అంటే వెంటనే డాక్టర్ దగ్గరకు వెళ్తారు. కానీ డిప్రెషన్, ఆందోళన, పానిక్ అటాక్, డీ-పర్సనలైజేషన్ లాంటి వాటిని బలహీనతలు లేదా అలసత్వంగా చూస్తారు. అవేవో బాధితులు కావాలని తెచ్చిపెట్టుకున్నట్టు భావిస్తారు. కానీ నిజానికి మానసిక ఆరోగ్యం కూడా శారీరక ఆరోగ్యంతో సమానమే. ఇవి రెండూ పరస్పర ఆధారితాలు.

తలనొప్పి, తల తిరుగుడు, వాంతులు, జీర్ణ సంబంధ ఇబ్బందులు, గుండె అత్యంత వేగంగా కొట్టుకోవడం, ముఖ కండరాలు అదరడం, చర్మం పాలిపోవడం లాంటి శారీరక లక్షణాల ద్వారా మానసిక వ్యాధులు వ్యక్తం అవుతాయి. అంటే, మనసు తాను అనుభవించే హింసను గుర్తించమని, త్వరగా ఈ బాధను తగ్గించే ఉపాయం చూడమని శరీరం ద్వారా వేడుకుంటుంది! కానీ పట్టించుకోం మనం. ఎందుకంటే, బాధితులు ఆ వ్యాధులకు సంబంధించిన మందులు తీసుకుంటే వాటికి బానిసలవుతారని, ఈ వ్యాధులు పూర్తిగా నయం కావనీ. నిజానికి ఇవన్నీ తప్పుడు భావనలు.

మానసిక వ్యాధులు కూడా శారీరక వ్యాధుల్లానే అనేక కారణాల వల్ల రావచ్చు. మెదడు రసాయనాల అసమతుల్యత, వంశపారంపర్యం, ఒత్తిడి, పరిసరాలు వంటి అంశాలు దీనికి కారణం అవుతాయి. కనుగొనదగిన కారణాలు ఏమీ లేకుండా కూడా మానసిక వ్యాధులు రావచ్చు. తొలిదశలోనే వ్యాధిని గుర్తించి సరైన చికిత్స చేస్తే, బాధితులు సాధారణ జీవితం గడపవచ్చు.

పిల్లలు, యువకులు, పెద్దలు ఎవరికి అయినా మానసిక సమస్యలు రావచ్చు. ప్రపంచ ఆరోగ్య సంస్థ లెక్కల ప్రకారం, 2021లో ప్రపంచంలో సుమారు 1.1 బిలియన్ మంది మానసిక వ్యాధుల బారినపడ్డారు (ప్రతి ఎనిమిది మందిలో ఒకరు) అసలు మీరు పని చేసేచోట, సంచరించే చోట మీకు తెలియకుండా ఇప్పటికే ఒకరిద్దరు డిప్రెషన్‌తోనో, ఏంగ్జయిటీతోనో వుండి ఉండొచ్చు. రోజువారీ జీవితంలో అవరోధం కలగనంతవరకూ పరవాలేదు. సమస్య వస్తే మాత్రం, దాచుకోవడం కంటే కుటుంబ సభ్యుల, స్నేహితుల, సహకారం తీసుకోవడం, వైద్యుని సంప్రదించడం ఎంతో అవసరం.

> ప్రపంచ ప్రసిద్ధ వ్యక్తుల్లో అబ్రహాం లింకన్, ఐజాక్ న్యూటన్, విన్సెంట్ వ్యాన్గో, చార్లెస్ డికెన్స్ నుంచీ మన దీపికా పదుకొనే వరకూ ఎందరో గొప్ప వ్యక్తులు, సెలబ్రిటీలు మానసిక వ్యాధులతో పోరాడి, సాధారణ స్థాయిని మించి ఉన్నతంగా బతకడమే కాకుండా, తమ ప్రతిభతో లోకానికి ప్రేరణగా నిలిచారు. మానసిక రోగులు చాలా వరకు ప్రమాదకారులు కాదు; మందులు వైద్యుని సూచన మేరకు తీసుకుంటే అడిక్షన్ రాదు.

అన్నిటికన్నా ముఖ్యమైన సంగతి, మానసిక ఆరోగ్య సమస్యలు ''నిజమైనవి'' అనే విషయాన్ని గ్రహించడం, అంగీకరించడం. జ్వరం వస్తే విశ్రాంతి తీసుకుంటాం కదా! అలాగే, మనసు అలసిపోయినప్పుడు, అది బాధపడినప్పుడు కూడా సహాయం కోరడం సిగ్గుపడాల్సిన విషయం కాదు. ధైర్యం, అవగాహన అవసరమయ్యే విషయం. మనసుని ఖాళీగా ఉంచకుండా మంచి వ్యాపకాలు పెట్టుకోవాలి. గ్రౌండింగ్ టెక్నిక్స్, బ్రీతింగ్ వ్యాయామాలు నేర్చుకోవాలి..

సర్వమానవ సహోదరత్వం, సౌభ్రాతృత్వం గురించి ఉపన్యాసాలు దంచేస్తాం. మనలో అది నిజంగా వుందని నిరూపించుకునే చిన్న అవకాశం ఒకటి ఏమిటంటే, మానసిక వ్యాధులతో బాధపడేవారిని చూసి ఎగతాళిగా నవ్వకుండా, తప్పుగా మాట్లాడకుండా ఉండటం, వాళ్లకి చేతనైన సహాయం చెయ్యడం.

ఆమాత్రం చేయలేమా?


వైష్ణవి గద్దె, వైద్య విద్యార్థిని

బులియన్
(బంగారం 10 గ్రా.: వెండి కిలో)
అక్టోబర్ 10న ముగింపు రూ.లలో

	హైదరాబాద్	విజయవాడ	విశాఖపట్నం	రాజమండ్రి	ప్రొద్దుటూరు	చెన్నై
బంగారం (24 క్యారెట్లు)	1,29,410	1,26,250	1,24,150	1,26,250.	1,28,000	1,24,370
బంగారం (22 క్యారెట్లు)	1,17,340	1,13,380	1,13,800	1,17,210	1,17,700	1,14,000
వెండి	1,70,000	1,58,600	1,67,000	1,58,600	1,60,000	1,71,000

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.